
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
జగిత్యాల
జిల్లా వార్తలు
5★★
ఆదివారం 7 డిసెంబరు 2025



ముగిసిన నామినేషన్ల పర్వం



- తొలి విడత పంచాయతీల్లో విస్తృతంగా ప్రచారం
- రెండో విడతకు ఉపసంహరణ పూర్తి
- మూడో విడతకు పూర్తయిన నామినేషన్ల పరిశీలన
- పోటీ నుంచి తప్పించడంపై రాజకీయ పక్షాల యత్నం

జగిత్యాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో ప్రధాన ఘట్టమైన నామినేషన్ల స్వీకరణ ముగిసింది. మొదటి విడత పల్లెల్లో ప్రచారం ఊపందుకుంది. రెండో విడత గ్రామాల్లో ఈనెల 6వ తేదీ వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగిసింది. మూడో విడత పంచాయతీల్లో నామినేషన్ల పరిశీలన, అప్పీళ్ల స్వీకరణ, అప్పీళ్ల పరిష్కారం కార్యక్రమాలు వచ్చే రెండు, మూడు రోజుల్లో పూర్తి కానున్నాయి. మూడో విడత పంచాయతీ ఎన్నికల్లో ఈనెల 9వ తేదీ వరకు నామినేషన్ల ఉప సంహరణకు గడువు ఉంది.

11న తొలి విడత ఎన్నికలు

జిల్లాలో తొలి విడత పంచాయతీ ఎన్నికల ప్రచారం ఊపందుకుంది. కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గంలోని మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం, మల్లాపూర్, కోరుట్ల మండలాలతో పాటు వేములవాడ అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని కథలాపూర్, మేడిపల్లి, భీమారం మండలాల్లో సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. తొలి విడతలో 122 సర్పంచ్, 1,172 వార్డు సభ్యుల స్థానాలకు ఈనెల 11న ఎన్నికలు జరగనున్నాయి. తొలి విడతలో సర్పంచ్ స్థానాలకు 461 మంది అభ్యర్థులు, వార్డు సభ్యుల స్థానాలకు 1,954 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. ఒకరికి మించి మరొకరు ప్రచారంలో దూసుకుపోవడానికి ప్రయత్నిస్తున్నారు.

రెండో విడతలో నేటి నుంచి ఊపందుకోనున్న ప్రచారం

జిల్లాలో రెండో విడత పంచాయతీ ఎన్నికలు జరుగుతున్న జగిత్యాల అసెంబ్లీ నియోజకవర్గంలోని జగిత్యాల అర్బన్, జగిత్యాల రూరల్, రాయికల్, బీర్‌పూర్, సారంగాపూర్ మండలాలతో పాటు చొప్పదండి నియోజకవర్గ పరిధిలోని మల్యాల, కొడిమ్యాల మండలాల్లో భారీగానే నామినేషన్లు వచ్చాయి.

రెండో విడతలో పంచాయతీ సర్పంచ్ స్థానాలు 144 ఉండగా 941 నామినేషన్లు దాఖలు అయ్యాయి. వార్డు సభ్యుల స్థానాలు 1,276 ఉండగా 2,927 నామినేషన్లను అధికారులు స్వీకరించారు. నామినేషన్ల పరిశీలన, అప్పీళ్ల స్వీకరణ, అప్పీళ్ల పరిష్కారం, నామినేషన్ల ఉప సంహరణ కార్యక్ర మాలు ముగిశాయి. ఆయా పంచాయతీల బరిలో నిలిచే అభ్యర్థుల వివరాలు తేలడంతో ప్రచార పర్వం షురూ కానుంది.



మూడో విడతలో 119 పంచాయతీలు

జిల్లాలోని ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గంలోని గ్రామాల్లో మూడో విడతలో సైతం భారీగా నామినేషన్లు దాఖలు అయ్యాయి. మూడో విడతలో 119 పంచాయతీల సర్పంచ్ స్థానాలకు గానూ 873 నామినేషన్లు, 1,088 వార్డు సభ్యుల స్థానాలకు గానూ 2,639 నామినేషన్లు దాఖలు అయ్యాయి. ఇందులో సర్పంచ్ స్థానాల్లో బుగ్గారం మండలంలో 90 నామినేషన్లు, ధర్మపురిలో 150, ఎండపల్లిలో 107, గొల్లపల్లిలో 203, పెగడపల్లిలో 196, వెల్గటూరులో 127 నామినేషన్లను అధికారులు స్వీకరించారు. వార్డు సభ్యుల స్థానాల్లో బుగ్గారం మండలంలో 263 నామినేషన్లు, ధర్మపురిలో 501, ఎండపల్లిలో 345, గొల్లపల్లిలో 613, పెగడపల్లిలో 553, వెల్గటూరులో 364 నామినేషన్లను అధికారులు స్వీకరించారు.

పలువురు చోటా మోటా నేతలు సైతం ఎన్నికల బరిలో దిగడానికి ఆసక్తిని కనబరిచి నామినేషన్లు సమర్పించారు. భారీగా దాఖలు అయిన నామినేషన్లు తమ కొంపలు ముంచుతాయని పంచాయతీ అభ్యర్థులు ఆందోళనకు గురవుతున్నారు. నామినేషన్లు వేసిన అభ్యర్థులను కలిసి నయానో-భయానో ఉప సంహరణ

మిగతా 8లో

క్రీడల్లో విద్యార్థుల ప్రతిభ

రాయికల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇటిక్యాల మోడల్ స్కూల్ విద్యార్థులు జిల్లా స్థాయి ఆటల పోటీల్లో ప్రతిభ కనబరిచారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని స్వామి వివేకానంద స్టేడియంలో పీఎం శ్రీ స్కూల్స్ ఆటల పోటీల్లో బాల, బాలికలు కబడ్డీ, వాలీబాల్, ఖోఖో, 100 మీటర్ల పరుగు పందెం షాట్‌పుట్, లాంగ్ జంప్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. ఈ ఆటల పోటీల్లో బాల, బాలికలు ప్రథమ స్థానంలో నిలిచి పలువురు విద్యార్థులు రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పూదరి నర్సయ్య తెలిపారు. విద్యార్థులను వ్యాయామ ఉపాధ్యాయుడు వంగల కిషోర్, ఉపాధ్యాయులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మల్యాల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని తక్కళ్లపల్లి ఫీడర్ నందు ఆదివారం చెట్ల కొమ్మలు తొలగించడం, మరమ్మతులు చేపట్టడం జరుగుతుందని దీంతో మల్యాల సబ్‌స్టేషన్ పరిధిలోని మల్యాల వ్యవసాయ బావులకు ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో ఏఈఈ ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శంకర్

జగిత్యాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా ఆర్ఎంపీ, పీఎంపీల సంఘం జిల్లా అధ్యక్షుడిగా పెగడపెల్లి మండలం కు చెందిన కసుమ శంకర్‌ను ఏకగ్రీవంగా ఎనుకున్నారు. జగిత్యాల పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం ఆర్ఎంపి, పిఎంపి జోనల్ అధ్యక్షులు దొంతుల మనోహర్ నేతృత్వంలో జరిగిన ఈ ఎన్నికలలో కార్యదర్శిగా బీర్‌పూర్ మండలంకు చెందిన కంది చంద్ర శేఖర్, కోశాధికారిగా గొల్లపెల్లి మండలానికి చెందిన గూడ లక్ష్మీనారాయణలను ఎంపిక చేసినట్లు జోనల్ అధ్యక్షులు దొంతుల మనోహర్ తెలిపారు.

నిబంధనల మేరకే ఏకగ్రీవాలు

- జిల్లా స్థాయి కమిటీ విచారణ తర్వాతే నిర్ణయం
- జిల్లాలో పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు
- సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
- ప్రశాంతంగా ఓటు వేయండి
- పోలింగ్ శాతం పెంచేందుకు ప్రత్యేక చర్యలు
- 'ఆంధ్రజ్యోతి'తో కలెక్టర్ సత్యప్రసాద్



జగిత్యాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎలక్షన్ కమిషన్ నిబంధనల మేరకే జిల్లాలో సర్పంచ్‌లు, వార్డు సభ్యుల ఏకగ్రీవాలపై నిర్ణయం తీసుకుంటున్నామని కలెక్టర్ సత్యప్రసాద్ తెలిపారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు సజావుగా, పారదర్శకంగా నిర్వహించేందుకు పకడ్బందీ చర్యలు చేపట్టినట్లు ఆయన అన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి పకడ్బందీగా అమలు చేస్తున్నామని చెప్పారు. గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో ఆయన మరిన్ని విషయాలను పంచుకున్నారు.

ఆంధ్రజ్యోతి: పంచాయతీ ఎన్నికల నిర్వహణకు ఎలాంటి ఏర్పాట్లు చేశారు?

కలెక్టర్: జిల్లాలో 385 పంచాయతీలు, 3,536 వార్డు సభ్యులకు మూడు విడతలుగా ఎన్నికల నిర్వహణ ప్రక్రియ సజావుగా కొనసాగు తోంది. పోలింగ్, కౌంటింగ్ నిర్వహణకు అవసరమైన ఎన్నికల సామాగ్రి, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు ఆయా మండలాలకు వెళ్లాయి. అక్కడి నుంచి పోలింగ్ కేంద్రాలకు తరలిస్తాం. మొత్తం 6,07,263 మంది ఓటర్లున్నారు. వారంతా ఓటు హక్కు వినియోగించుకునేలా అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం. పోలింగ్ ప్రక్రియ నిష్పక్షపాతంగా జరిపేందుకు ఎన్నికల విధుల్లో పాల్గొనే ఉద్యోగుల ర్యాండమైజేషన్ మూడు దశలో నిర్వహిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

కలెక్టర్: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నాము. అభ్యర్థులు, నాయకులు ఎంసీసీ నిబంధనలు ఉల్లంఘించకుండా అన్ని మండలాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నాయి. నిబంధలనకు ఉల్లంఘించిన వారిపై చర్యలు ఉంటాయి. అభ్యర్థులు ప్రచారంలో నిబంధనలు పాటించేలా చర్యలు తీసుకుంటున్నాం. సోషల్ మీడియాలో చేసే ప్రచారంపై నిఘా పెట్టాం.

ఆంధ్రజ్యోతి: అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై ఎలాంటి నిఘా పెట్టారు?

కలెక్టర్: అభ్యర్థుల ఎన్నికల ఖర్చులపై నిఘా పెట్టేందుకు ప్రత్యేక బృందాలు పనిచేస్తున్నాయి. మండలానికి ఒక అధికారిని నియమించి అభ్యర్థులు పరిమితికి మించి ఖర్చు చేయకుండా నిఘా పెట్టాం. ఎన్నికల ఖర్చులో నిబంధనలు ఉల్లంఘించే అభ్యర్థులపై చర్యలు ఉంటాయి.

ఆంధ్రజ్యోతి: సర్పంచ్, వార్డు సభ్యుల ఏకగ్రీవాల విషయంలో ఎలా ముందుకు వెళ్తున్నారు?

కలెక్టర్: జిల్లాలో మొదటి విడత పంచాయతీ ఎన్నికల్లో నాలుగు సర్పంచ్ స్థానాలు, 348 వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. ఆయా పదవులకు ఏకగ్రీవం అయిన చోట్ల నామినేషన్లు ఉపసంహరించుకున్న వారి వద్ద నుంచి డిక్లరేషన్ తీసుకుంటున్నాం. పదవులకు వేలం పాటలు నిర్వహించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధం. అలా చేస్తే చట్ట ప్రకారం చర్యలు ఉంటాయి. జిల్లా స్థాయి ప్రత్యేక కమిటీ విచారణ చేపట్టి ఎన్‌ఓసీ ఇచ్చాకే ఏకగ్రీవ ఎన్నికపై ముందుకు వెళ్తాం. మెట్‌పల్లి మండలం జగ్గసాగర్‌లో ఫిర్యాదులు రావడంతో ఆర్డీవో, తహసీల్దార్ ఆధ్వర్యంలో విచారణ చేపట్టాం. ఆయా చోట్ల ఎన్నికలు నిర్వహించేలా చర్యలు తీసుకున్నాం. సింగిల్ నామినేషన్ వచ్చిన అభ్యర్థుల నుంచి డిక్లరేషన్ తీసుకుంటున్నాం. ఏకగ్రీవం కోసం ఎవరైనా బలవంతం చేస్తే నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

ఆంధ్రజ్యోతి: పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

కలెక్టర్: పంచాయతీ ఎన్నికల్లో పోలింగ్ శాతాన్ని పెంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాం. పోలింగ్ 90 శాతానికి మించేలా ఓటర్లను చైతన్యం చేసే కార్యక్రమాలను చేపట్టాం. పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తున్నాం. పోలింగ్ తేదీకి మూడు రోజుల ముందే ఫోటో ఓటరుస్లిప్ పంపిణీ పూర్తి చేస్తాం. సమస్యాత్మక కేంద్రాలతో పాటు పలు చోట్ల వెబ్ క్యాస్టింగ్ చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. అర్హులందరూ విధిగా ఓటు హక్కును వినియోగించుకోవాలి. ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా ఓటు వేయాలి.

ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలి

-అదనపు కలెక్టర్ రాజాగౌడ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాజాగౌడ్

భీమారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): శిక్షణకు హాజరైన సిబ్బంది ఎన్నికల విధులను సక్రమంగా నిర్వర్తించాలని అదనపు కలెక్టర్ రాజాగౌడ్ అన్నారు. భీమారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామ పంచాయతీ ఎన్నికలు దశ-1, దశ-2కు సంబంధించి ప్రిసైడింగ్, రిటర్నింగ్, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని శనివారం పరిశీలించారు. అక్కడి ఏర్పాట్లను పరిశీలించి, శిక్షణ కార్యక్రమం నిబంధనలు, ఎన్నికల మార్గదర్శకాలకు అనుగుణంగా ఎటువంటి అంతరాయం లేకుండా సజావుగా జరుగుతున్నట్లు గుర్తించి పూర్తి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నీరజ, జోనల్ ఆఫీసర్, ఎంఈవో మధుసూదన్ రెడ్డి, నోడల్ ఆఫీసర్, డీఈవో రాము పాల్గొన్నారు.

అభ్యర్థులు ఎన్నికల నియమావళి పాటించాలి

-ఎన్నికల పరిశీలకుడు మనోహర్

ఇబ్రహీంపట్నం, డిసెంబరు6(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల నియమావళిని పాటించాలని ఎన్నికల పరిశీలకులు మనోహర్ తెలిపారు. శనివారం ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలోని రైతు వేదిక కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో పోటీ సర్పంచ్, వార్డు స్థానాల అభ్యర్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల ఖర్చులను 45 రోజుల్లో సమర్పించాలని సూచించారు. లేనియెడ సభ్యత్వం రద్దు చేస్తామన్నారు.

ఐదువేల జనాభా కంటే ఎక్కువ గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థుల ఖర్చు రూ.2.50 లక్షలు, వార్డు సభ్యుల ఖర్చు రూ.50 వేలు, ఐదువేల కంటే తక్కువగా ఉన్న జనాభా గల గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థికి రూ.1.50 లక్షలు, వార్డు సభ్యులకు రూ.30 వేలకు మించరాదని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గణేష్‌తోపాటు ఆయా గ్రామాల అభ్యర్థులు పాల్గొన్నారు.

మలి విడత బరిలో 521 మంది సర్పంచ్ అభ్యర్థులు

వార్డు స్థానాలకు 2,664 మంది

జగిత్యాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మలి విడత పంచాయతీ ఎన్నికల్లో బరిలో నిలిచిన అభ్యర్థుల లెక్క శనివారం తేలింది. నామినేషన్ల ఉపసంహరణ గడువు ముగియడంతో పంచాయతీలు, వార్డుల వారీగా బరిలో నిలిచిన అభ్యర్థుల వివరాలను అధికారులు ప్రకటించారు. జిల్లాలో మలి విడతలో 144 సర్పంచ్ స్థానాలకు గాను 10 స్థానాలు ఏకగ్రీవం కాగా 134 స్థానాల్లో ఎన్నికలు నిర్వహించనుండగా 521 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు. 1,276 వార్డు సభ్యుల స్థానాలకు జగిత్యాల రూరల్ మండలంలో గుట్రాజుపల్లి గ్రామంలో ఒకడో వార్డు సభ్యుడి స్థానానికి నామినేషన్ దాఖలు కాలేదు. 328 స్థానాల్లో వార్డు సభ్యులు ఏకగ్రీవమయ్యారు. 947 వార్డు సభ్యుల స్థానాల్లో ఎన్నికలు నిర్వహించనుండగా 2,664 మంది అభ్యర్థులు పోటీ పడుతున్నారు.

సర్పంచ్ స్థానాలకు పోటీ ఇలా..

మండలం	పంచాయతీలు	ఏకగ్రీవ సర్పంచ్‌లు	ఎన్నికలు జరిగే స్థానాలు	పోటీలో ఉన్న అభ్యర్థులు
బీర్‌పూర్	17	1	16	47
జగిత్యాల రూరల్	29	2	27	104
జగిత్యాల అర్బన్	5	1	4	19
కొడిమ్యాల	24	1	23	91
మల్యాల	19	0	19	80
రాయికల్	32	2	30	114
సారంగాపూర్	18	3	15	66
మొత్తం	144	10	134	521

వార్డు సభ్యుల స్థానాలకు పోటీ ఇలా..

మండలం	వార్డులు	ఏకగ్రీవ స్థానాలు	ఎన్నికలు జరిగే స్థానాలు	పోటీలో ఉన్న అభ్యర్థులు
బీర్‌పూర్	136	21	115	268
జగిత్యాల రూరల్	268	86	181	505
జగిత్యాల అర్బన్	50	14	36	99
కొడిమ్యాల	216	65	151	460
మల్యాల	186	20	166	480
రాయికల్	276	86	190	536
సారంగాపూర్	144	36	108	316
మొత్తం	1,276	328	947	2,664

మలి విడతలో పది సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవం

జగిత్యాల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మలి విడత పంచాయతీ ఎన్నికల్లో పది సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. శనివారం నామినేషన్ల ఉప సంహరణ గడువు ముగిసే సరికి సింగిల్ నామినేషన్లు పది పంచాయతీ సర్పంచ్ స్థానాల్లో మిగిలాయి. సమగ్ర పరిశీలన, విచారణ అనంతరం అధికారులు ప్రకటించడం లాంఛనంగా మారింది. జిల్లాలో మలి విడత పంచాయతీ ఎన్నికల్లో 144 సర్పంచ్ స్థానాలకు, 1,276 వార్డు సభ్యుల స్థానాలకు ఎన్నికలను నిర్వహించడానికి నోటిఫికేషన్ విడుదల చేశారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్ స్థానాలకు పోటీ పడుతూ 941 అభ్యర్థులు, వార్డు సభ్యునికి పోటీ పడుతూ 2,927 మంది నామినేషన్లు దాఖలు చేశారు. ఇందులో ఏడు సర్పంచ్ స్థానాల్లో సింగిల్ నామినేషన్లు దాఖలు అయ్యాయి. నామినేషన్ల పరిశీలన అనంతరం 646 సర్పంచ్ అభ్యర్థులు, 2,811 వార్డు సభ్యుల అభ్యర్థుల నామినేషన్లు చెల్లుబాటు అయినట్లుగా అధికారులు ప్రకటించారు. జగిత్యాల రూరల్ మండలం అంబారిపేట, కన్నాపూర్, రాయికల్ మండలం వస్తాపూర్‌లో పోటీలో ఉన్న అభ్యర్థులు నామినేషన్లను ఉప సంహరించుకోవడంతో సర్పంచ్ ఎన్నిక ఏకగ్రీవమైంది. జగిత్యాల రూరల్ మండలం చర్లపల్లి సర్పంచ్‌గా మేడిపల్లి వనిత, కొడిమ్యాల మండలం చింతలపల్లి సర్పంచ్‌గా ఎలకపల్లి సుమలత, రాయికల్ మండలం వీరాపూర్ సర్పంచ్‌గా దిండిగల గంగు, సారంగపూర్ మండలం నాయకపు గూడెం సర్పంచ్‌గా పుష్పనాథ్, సారంగాపూర్ మండలం రంగపేట వడ్డెర కాలనీ సర్పంచ్‌గా పల్లెపు మాదవి, సారంగపూర్ మండలం బీంరెడ్డి గూడెం సర్పంచ్‌గా మేన్నేని ప్రమీళ, బీర్‌పూర్ మండలం గోండు గూడెం సర్పంచ్‌గా పురుక దీప కల్పనలు సింగిల్ నామినేషన్‌తో ఏకగ్రీవమయ్యారు. అయితే నామినేషన్ల ఉప సంహరణ కార్యక్రమంలో పోటీ దారులు విరమించుకోవడంతో రాయికల్ మండలం వస్తాపూర్ సర్పంచ్‌గా గుడ్లవత్ తిరుపతి, జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట సర్పంచ్‌గా ఒడిసెల గంగాధర్ గౌడ్, జగిత్యాల రూరల్ మండలం కన్నాపూర్ సర్పంచ్‌గా పొట్టవర్తిని సతీష్ కుమార్‌లు ఏకగ్రీవమయ్యారు.

చెక్‌పోస్టుల్లో ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలి



రాయపట్నం చెక్‌పోస్ట్ వద్ద రిజిష్టర్ తనిఖీ చేస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

ధర్మపురి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అంతర్ జిల్లా సరిహద్దులో ఉన్న చెక్‌పోస్టుల్లో ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని ఎస్పీ అశోక్‌కుమార్ సిబ్బందిని ఆదేశించారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలంలోని అంతర్ జిల్లా సరిహద్దున గల రాయపట్నం చెక్‌పోస్ట్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన చెక్ పోస్ట్ వద్ద వాహనాల రాక పోకలకు సంబంధించిన రిజిష్టర్‌ను తనిఖీ చేసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్పీ అశోక్‌కుమార్ మాట్లాడుతూ చెక్ పోస్ట్ వద్ద సిబ్బంది అన్ని వాహనాలను క్షుణ్ణంగా తనిఖీ చేయాలని సూచించారు. ఎలాంటి అనుమతి లేని డబ్బు, విలువ గల వస్తువుల అక్రమ రవాణాను అరికట్టాలని ఆయన అన్నారు. స్థానిక ఎన్నికలో ఎలాంటి అక్రమాలు జరుగకుండా ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని ఆయన పేర్కొన్నారు. ఎన్నికలు ముగిసే వరకు సిబ్బంది తమ విధులు నిర్వర్తించాలని ఆయన కోరారు. పోలీస్ స్టేషన్ పరిధిలో విస్తృతంగా తనిఖీలు చేపట్టాలని ఆయన తెలిపారు. ఎన్నికల్లో ఎలాంటి అక్రమాలు జరుగకుండా చూసుకోవాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి సీఐ రాంనర్సింహారెడ్డి, ధర్మపురి, వెలగటూర్, బుగ్గారం ఎస్ఐలు మహేష్, ఉదయ్‌కుమార్, సతీష్‌కుమార్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శాంతియుతంగా ఎన్నికల నిర్వహణకు సహకరించాలి

వెల్గటూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించేందుకు ప్రతీ ఒక్కరు పోలీసులకు సహకరించాలని ఎస్పీ అశోక్ కుమార్ కోరారు. శనివారం వెల్గటూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని కిషన్‌రావ్‌పేట గ్రామంలో పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాలో భద్రతా ఏర్పాట్లు, ప్రహరీ గోడ, విద్యుత్ సదుపాయాలు, తాగునీరు వంటి మౌలిక అవసరాలు ముందుగానే సిద్ధంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట ప్రసాద్, ధర్మపురి సీఐ రామ్ నరసింహారెడ్డి, ఎస్.ఐలు ఉదయ్ కుమార్, మహేష్ పాల్గొన్నారు.

ఏకగ్రీవమైన సర్పంచ్‌లకు ఎమ్మెల్యే అభినందన

రాయికల్, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని వస్తాపూర్ గ్రామ సర్పంచ్‌గా గుగ్లావత్ తిరుపతి ఏకగ్రీవం కాగా జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ ఆయనను అభినందించారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు రవీందర్ రావు, కోల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ దేవరాజు లత, బాపన్న, నాయకులు నాగరాజు, గడ్డం దీపక్ రెడ్డి, తిరుపతి రెడ్డి, యూత్ సభ్యులు పాల్గొన్నారు.

●జగిత్యాల అర్బన్: జగిత్యాల అర్బన్ మండలం అంబారిపేట గ్రామ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎంపిక యిన గొడిసెల గంగాధర్‌ను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అభినందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజక వర్గంలో నాతో కలిసి పనిచేసిన 8 గ్రామ పంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయని అన్నారు.

ఈకార్యక్రమంలో వెంకటేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ తక్కురీ మల్లేశం, మాజీ ఉప సర్పంచ్ నారాయణ, నాగరాజు, చెట్‌పెల్లి సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

●జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని కన్నాపూర్ సర్పంచ్‌గా ఏకగ్రీవంగా ఎన్నికైనా పొట్టవత్తిని సతీష్ శనివారం మర్యాదపూర్వకంగా జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ ను కలిశారు. ఈసంధర్భంగా సతీష్‌ను ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అభినం దించారు.

ఈకార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ దామోదర్ రావు, సీనియర్ నాయకులు బాలముకుందం, ప్రభాత్‌సింగ్ ఠాకూర్, రఘు, జైరాంసురేష్, తదితరులు పాల్గొన్నారు.

గల్ఫ్‌లో గుంటపల్లిచెరువు తండా వాసి మృతి



రవి(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండలం గుంటపల్లిచెరువు తండాకు చెందిన గుగులోతు రవి(43) సౌదీలో గుండెపోటుతో మృతిచెందాడు. స్థానికులు, కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. గ్రామంలో రవి తనకున్న ఎకరం పొలంలో వ్యవసాయంతో పాటు దినసరి కూలీగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తుండేవాడు. ఐదేళ్లక్రితం రూ.2లక్షలు అప్పు చేసి ఖతార్ వెళ్లాడు. అక్కడ సరైన పనిదొరకక వెళ్లిన ఆరునెలలకే ఇంటికి చేరుకున్నాడు. రెండేళ్ల క్రితం మరో రూ.5లక్షలు బాకీ చేసి కూతురు వివాహం జరిపించాడు. అప్పు తీర్చేందుకు యేడాది క్రితం రూ.3లక్షలు అప్పుచేసి సందర్శక వీసాపై సౌదీ దేశానికి వెళ్లాడు. అక్కడిగదిలో అస్వస్థతకు గురైన ఆయనను తోటి స్నేహితులు ఆసుపత్రికి తరలించారు. అప్పటికే రవి గుండెపోటుతో చనిపోయాడని వైద్యులు నిర్ధారించారు. శనివారం మరణవార్త తెలియడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా రోధిస్తున్నారు. మృతుడికి భార్య మంజుల, ముగ్గురు కూతుళ్లు స్రవంతి, చిట్టి, సోనా, కొడుకు దివాకర్ ఉన్నారు. కాగా భారత రాయబార కార్యాలయం, ప్రభుత్వం స్పందించి మృతదేహాన్ని స్వగ్రామానికి పంపించేలా చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

యువకుడి ఆత్మహత్య



రాకేష్(ఫైల్)

ధర్మపురి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని కాశెట్టి వాడకు చెందిన చెరుకు రాకేష్(33) అనేవ్యక్తి మానసిక వేదనకు గురై ఉరి వేసుకొని శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ధర్మపురి ఎస్ఐ జి.మహేష్ కథనం ప్రకారం.. చెరుకు రాకేష్‌కు ఐదుసంవత్సరాల క్రితం వివాహం కాగా భార్య, ఇద్దరు కొడుకులు ఉన్నారు. రాకేష్ నాలుగు నెలల క్రితం కువైట్ దేశం వెళ్లి అక్కడ పని దొరక్క వారం రోజులకే ఇంటికి తిరిగి వచ్చాడు. అప్పటినుంచి ఆర్థికంగా నష్టపోయానని తరచూ బాధపడు తుండేవాడు. శనివారం మధ్యాహ్నం తన బంధువైన కాశెట్టి నాగరాజు షాపునకు వెళ్తున్నానని చెప్పి ఇంటినుంచి బయలుదేరాడు. అనంతరం ఆ షాపులో ఉరి వేసుకొని మృతిచెందాడు. మృతుడి తండ్రి సత్యన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ మహేష్ తెలిపారు.

నిఘా..జాగ్రత్త

- అమల్లోకి ఎన్నికల కోడ్
- నిఘా కోసం ప్రత్యేక బృందాలు



ముత్తారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నాటి నుంచే మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్(ఎంసీసీ) అమల్లోకి వచ్చింది. ఫలితంగా అన్ని పార్టీల నాయకులు పోటీకి సిద్ధమవుతున్న అభ్యర్థులు అప్రమత్తంగా వ్యవహరించాల్సి ఉంటుంది. ఎన్నికలు జరగనున్న గ్రామీణ ప్రాంతాల్లో ఎన్నికలు ప్రక్రియ పూర్తయ్యే వరకు కోడ్ అమల్లో ఉంటుంది.

పాటించవలసినవి..

కోడ్ అమల్లో ఉన్న నేపథ్యంలో మంత్రులు అధికారిక పర్యటనలో ఎన్నికల ప్రచారంగా ఉపయోగించకూడదు. ఎన్నికల ప్రచారం సమయంలో ప్రభుత్వ వాహనాలు ఉపయోగించొద్దు. వాహనాలను అధికారిక పనులకే వినియోగించాలి. ఎవరైనా హోదాను దుర్వినియోగం చేస్తే అధికారిక వాహనాలను ఉపసంహరించుకునే అవకాశముంది. కేంద్ర, రాష్ట్ర మంత్రులు ఎవరైనా కూడా ఎన్నికల విధుల్లో ఉన్న అధికారిని అధికారిక చర్చలకు కూడా పిలవకూడదు. స్థానిక ఎన్నికల సమయంలో వ్యక్తిగత పర్యటనకు వచ్చినా మంత్రులు అధికారులను పిలిస్తే వారు వెళ్తే నిబంధనలకు విరుద్ధంగానే భావించి ఎంసీసీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటారు. అధికారంలో ఉన్న పార్టీలు సంక్షేమ పథకాల ముద్రణ, ఎలక్ట్రానిక్ మీడియాలో ప్రభుత్వ ఖర్చులతో ప్రచారం చేయొద్దు. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రకటనలు, హోర్డింగ్‌లు వెంటనే తొలగించాలి. ఏదైనా పని మంజూరు చేస్తూ ఉత్తర్వులు విడుదలైనా కోడ్ ముగిసే వరకు ప్రారంభించడానికి అనుమతి ఉండదు.

ప్రచారంలో జాగ్రత్తలు వహించాలి

ఎన్నికల ప్రచార సమయంలో పార్టీ, అభ్యర్థులు ప్రస్తుతం ఉన్న విభేదాలను తీవ్రతరం చేయడం, పరస్పర ద్వేషభావాన్ని పెంపొందించేలా వ్యవహరించొద్దు. నిరాధర ఆరోపణలు చేయకూడదు. ఎన్నికల ప్రచారంలో ప్రార్థనా మందిరాలను వేదికగా చేసుకోవద్దు. లౌడ్ స్పీకర్ల ఉపయోగానికి సైతం అధికారుల నుంచి అనుమతి తీసుకోవాల్సి ఉంటుంది.

బస్ డ్రైవర్‌ను బెదిరించిన వ్యక్తిపై కేసు

వేములవాడ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వేములవాడ ఆర్టీసీ డిపోకు చెందిన బస్సును ఈనెల 5వ తేదీన వేములవాడ మూలవాగు వంతెనపై ఆపి డ్రైవర్, కండక్టర్‌ను బెదిరించిన మూర్తి రెడ్డిపై శనివారం కేసు నమోదు చేసినట్లు టౌన్ ఎస్ఐ రామ్మోహన్‌గౌడ్ తెలిపారు. ఈ సంఘటనపై ఆర్టీసీ కండక్టర్ బాలసాని స్వప్న, డ్రైవర్ మొగిలి వెంకటేష్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ మేరకు విచారణ జరిపి బెదిరించిన వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన తెలిపారు.

విద్యుదాఘాతంతో మేక మృతి

గొల్లపల్లి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గొల్లపల్లి మండలం గంగాదేవిపల్లె గ్రామంలో కొలగాని రవి అనే మేకల కాపరికి చెందిన మేక ట్రాన్స్‌ఫార్మర్ వద్ద మేత మేస్తూ విద్యుదాఘాతంతో శనివారం మృతిచెందింది. శనివారం గ్రామరెవెన్యూ పరిధిలో గల విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు అమర్చిన కంచెవద్ద మేక మేత మేస్తుండగా విద్యుదాతానికి గురై మృతిచెందినట్లు బాధితుడు పేర్కొన్నాడు. తనకు న్యాయం చేయాలని బాధితుడు రవి ప్రభుత్వాన్ని కోరాడు.

చోరీకి పాల్పడిన యువకుడి అరెస్టు

వీర్నపల్లి(ఎల్లారెడ్డిపేట), డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వీర్నపల్లి మండల కేంద్రంలోని మోటారు వైండింగ్ దుకాణంలో చోరీకి పాల్పడిన సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం వెంకటాపూర్ గ్రామానికి చెందిన యువకుడు మోతె సంతోష్‌ను అరెస్ట్ చేశామని ఎస్ఐ లక్ష్మణ్ శనివారం తెలిపారు. నిందితుడివద్ద నుంచి రూ.35వేల విలువైన బోరుమోటారు సామగ్రి స్వాధీనపర్చుకున్నామని పేర్కొన్నారు. వీర్నపల్లిలోని పర్లపల్లి బాబు దుకాణంలో నుంచి సంతోష్ వ్యవసాయ బోరు మోటారుతోపాటు సామగ్రిని ఎత్తుకెళ్లాడని చెప్పారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించామని పేర్కొన్నారు. చోరీ జరిగిన 24గంటల్లోనే నిందితుడిని పట్టుకుని రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ లక్ష్మణ్ వివరించారు.

బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ



చందుర్తిలో కొవ్వొత్తుల ర్యాలీలో పాల్గొన్న నాయకులు

చందుర్తి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ కోసం ఆత్మాహత్యకు పాల్పడిన సాయి ఈశ్వర్ ఆత్మకు శాంతి చేకూరాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం రాత్రి చందుర్తిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధికార ప్రతినిధి కోరుట్ల రమేష్ మాట్లాడుతూ బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కొరకు న్యాయం కావాలని కోరుతూ ఒక యువకుడు ప్రాణం తీసుకోవాల్సిన పరిస్థితి రావడం చాలా బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ తిప్పని శ్రీనివాస్,బీజీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షులు అమరబండ ప్రసాద్, నాయకులు వనపర్తి సతీష్, హమయ్య చారి, చిలక శ్రీనివాస్, మేడిశెట్టి జగన్, బత్తుల కమలాకర్, తదితరులు పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలి



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

బోయినపల్లి డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో చేపట్టిన ఫ్రాడ్ కా ఫుల్ స్టాప్ అవగాహన కార్యక్రమంలో భాగంగా శనివారం బోయినపల్లి మండల పరిధిలోని రూసో కళాశాలలో విద్యార్థులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై జునైద్ మాట్లాడుతూ సైబర్ నేరాల నుంచి రక్షించుకోవాలంటే అవగాహన తప్పనిసరి అని అన్నారు. ప్రతి ఒక్కరూ సైబర్ భద్రతను వ్యక్తిగత బాధ్యతగా తీసుకోవాలని అనుమానాస్పద లింకులు, ఓటీపీ, బ్యాంక్ వివరాలు పంచుకోవద్దని సూచించారు. ముఖ్యంగా సామాజిక మాధ్యమాల ద్వారా వ్యక్తిగత సమాచారం, ఫొటోలను ఇతరులతో పంచుకోకూడదని సూచించారు. ప్రస్తుత కాలంలో సోషల్ మీడియా సైట్‌లను వాడేటప్పుడు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సైబర్ మోసాలు పెరుగుతున్న నేపథ్యంలో విద్యార్థులు ఎక్కువ జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏదైనా మోసం జరిగిన వెంటనే 1930కి కాల్ చేసి ఫిర్యాదు చేయాలన్నారు. కార్యక్రమంలో నేర్చుకున్న విషయాల్ని ప్రతి ఒక్కరూ తమ ఇంట్లో వాళ్ళకు అవగాహన కల్పించాలన్నారు. ఉపాధ్యాయులు కూడా సైబర్ నేరాల నియంత్రణలో తమవంతు పాత్ర పోషించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దేవేందర్, సంపత్, రాజ్ కుమార్, మౌనిక, సత్యం తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు వెల్లుల్ల విద్యార్థులు



ఎంపికైన క్రీడాకారులను అభినందిస్తున్న ప్రధానోపాధ్యాయుడు

మెట్‌పల్లి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలకు వెల్లుల్ల విద్యార్థులు ఎంపికయ్యారు. 69వ స్కూల్ గేమ్స్‌ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంథనిలో జరిగిన బ్యాడ్మింటన్ అండర్-17 విభాగంలో బాలబాలికలు ఉత్తమ ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు గడ్డం శ్రీనివాస్‌రెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయుడు కొమురయ్య తెలిపారు. శనివారం జిల్లా నుంచి పాల్గొన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వెల్లుల్ల బాలబాలికలు బబ్బిలి అక్షయ్, మాలేపు రిషికలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికవగా వారిని ప్రధానోపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులున్నారు.

నంబర్‌ప్లేట్ లేని వాహనాలపై పోలీసుల కొరడా



పోలీసులకు పట్టుబడిన వాహనాలు

కరీంనగర్ క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నంబర్ ప్లేట్స్ లేకుండా రోడ్లపై తిరుగుతున్న వాహనాలపై కరీంనగర్ ట్రాఫిక్ పోలీసులు కొరడా ఝులిపించారు. కరీంనగర్‌లోని వివిధ ప్రాంతాల్లో ట్రాఫిక్ పోలీస్ అధికారులు శనివారం వాహనాల తనిఖీ నిర్వహించారు. కరీంనగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాలలో సరైన నంబర్ ప్లేట్లు లేని 73 వాహనాలను గుర్తించారు. వాటి యజమానులపై మోటార్ వాహనాల చట్టం ప్రకారం జరిమానాలు విధించారు. జరిమానాలు విధించిన అనంతరం, ఆయా వాహనాలకు సరైన నంబర్ ప్లేట్లను బిగింపజేసి పంపినట్లు కరీంనగర్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కరీముల్లాఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పౌరులు రోడ్డు భద్రతా నియమాలను, ట్రాఫిక్ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలన్నారు.

తొలగించని సిల్ట్..

- బురద నీటితో నిండిన మురికి కాలువ

కాల్వశ్రీరాంపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొట్లపల్లి గ్రామంలో బురద నీటితో మురికి కాలువలు అపరిశుభ్రంగా మారాయి. ఈ కారణంగా దోమలు వృద్ధిచెందాయని గ్రామస్థులు ఆందోళన చెందుతున్నారు. మురికి కాలువల్లో చెత్త పేరుకుపోయినా పారిశుధ్య సిబ్బంది, అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపిస్తున్నారు. మురికి కాలువల్లో సిల్ట్ తొలగించి డ్రైనేజీలు ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ప్రజలు పేర్కొంటున్నారు. అనారోగ్యాల బారిన పడక ముందే చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



చెత్తతో అపరిశుభ్రంగా మారిన డ్రైనేజీ

అభ్యర్థులందరికీ.. ఒకే గొంతు

- ప్రచారంలో సలీం గళం



వాయిస్ రికార్డింగ్ చేస్తున్న సలీం

సిరిసిల్ల, డిసెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): ఆయన మైక్‌లో కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ బలపరిచిన అభ్య ర్థులను గెలిపించాలని అంటారు.. స్వతంత్రులకు ఓటెయ్యండి అంటూ ప్రచారం చేస్తాడు... గొంతు ఒక్కటే అభ్యర్థులు, పార్టీలు వేరు.. ఈ గొంతుప్రస్తుతం తెలంగాణ పంచా యతీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా వినిపిస్తూనే ఉంటుంది. తెలంగాణ, ఆంధ్ర, రాయలసీమ ఏప్రాంతంలోనైనా శాసన సభ, పార్లమెంట్ ఏ ఎన్నికల్లో అయినా మారుమోగుతూనే ఉంటుంది. బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ, వైసీపీ, బీఎస్పీ, జనసేన పార్టీలకు ఓటేద్దాం రండి అంటూ రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రానికి చెందిన సలీం గొంతుతో ప్రచారం సాగుతుంది. ఇప్పుడు పంచాయతీ ఎన్నికల్లోనూ వివిధ అభ్యర్థులకు ప్రచారం మొదలు పెటారు. అతను దాదాపు నాలుగు దశాబ్దాలుగా అందరు అభ్యర్థుల ప్రచారానికి ఆయన గొంతు అరువు ఇస్తూనేఉన్నాడు. సార్వత్రిక ఎన్నికలైనా.. స్థానిక ఎన్నికలైనా రాజన్న సిరిసిల్ల జిల్లాకేంద్రానికి చెందిన ప్రచారకళాకారుడు ఎండీ సలీం గొంతు వినిపించాల్సిందే. సిరిసిల్లలోని లక్ష్మీ థియేటర్ రిక్షాలో కూర్చొని సినిమాల ప్రచారం కోసం 1974లో వినిపించిన సలీం గొంతు అందరినీ ఆకట్టుకుంది. సినిమా ప్రచారం, బీడీలు, లాటరీ టిక్కెట్లకు ఆయన ప్రచారం చేసేవారు. ఇలా సలీం గొంతు వివిధ కంపెనీల వారిని ఆకట్టుకుంది. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన భాగ్యలక్ష్మి లాటరీ టిక్కెట్ల అమ్మకాల ప్రచారంతో సలీం కంఠం రాష్ట్ర వ్యాప్తంగా మారుమోగింది. ఆడియో క్యాసెట్లు రావడంతో సలీం ప్రచారం మరింత ఊపందుకుంది. రాజమండ్రి పాలకోవా నుంచి హైదరాబాద్‌లో మార్కెట్లకి విడుదలయ్యే వస్తువుల ప్రచారానికి సలీం గొంతునే ఉపయో గించేవారు. వాణిజ్య ప్రచారాల నుంచి సలీం గొంతు రాజకీయ పార్టీలకు చేరింది. అన్ని పార్టీల వారు తమ ఎన్నికల ప్రచారానికి, ఆందోళన కార్యక్రమాల ప్రచారానికి సలీం గొంతుతోనే ప్రచారం చేసుకుంటున్నారు. మాతృభాష ఉర్దూ అయినా సలీం తెలుగులో అనర్గళంగా మాట్లాడుతారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాలతో పాటు చెన్నై, ముంబాయి, భీవండిలోనూ సలీం గొంతును ప్రచారానికి ఉపయోగించుకున్నారు. వృత్తి పరంగా రికార్డింగ్ సెంటర్, మైక్, టెంట్స్ సరఫరా చేసే సలీం, గాయకుడు ఘంటసాల గానం చేసిన పాటలను ఒక దగ్గర నిక్షిప్తం చేయాలన్న తపనతో ఘంటసాల కల్చరల్ ఆకాడమీ ఏర్పాటు చేశారు. 40ఏళ్లుగా ప్రచార రంగంలో తనకంటూ ఓ స్థానం కల్పించుకున్న సలీం ఆకాశవాణిలో ప్రత్యక్ష వాఖ్యానం, ఘంటసాల ఆలపించిన పాటలకు వ్యాఖ్యానం అందించారు. సలీం మైసూర్ యూనివర్సిటీ డాక్టరేట్‌తో పాటు కళాజ్యోతి, కళాసాగర్, రాష్ట్ర ప్రభుత్వ పురస్కారాలను సైతం అందుకున్నారు. ప్రస్తుత పంచా యతీ ఎన్నికల్లోనూ అభ్యర్థులు ఆయన గొంతును ప్రచారాలకు ఉపయోగించుకుంటున్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

ముస్తాబాద్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామలక్ష్మణపల్లె వై జంక్షన్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. కొండాపూర్ గ్రామానికి చెందిన చిగురు వెంకటయ్య, భార్య లక్ష్మితోకలిసి ద్విచక్రవాహనంపై వెళుతుండగా ఎదురుగా వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. దీంతో వారు వాహనంపై నుంచి కిందపడి పోయారు. వెంకటయ్యకు తీవ్ర గాయాలు కాగా ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలోని ఓప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. భార్యలక్ష్మికి స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం లింగన్నపేట పెద్దమ్మ ఆలయం మూలమలుపు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. కొత్తపల్లికి చెందిన దేవిరెడ్డి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా అదుపుతప్పడంతో ప్రమాదంజరిగింది. స్థానికులు 108కి సమాచారం ఇవ్వడంతో హుటాహుటిన సిబ్బంది అక్కడికి చేరుకుని గాయపడ్డ దేవిరెడ్డిని గంభీరావుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

శంకరపట్నం: శంకరపట్నం మండలం తాడికల్‌లోని పెద్దమ్మతల్లి దేవాలయం వద్ద జాతీయ రహదారిపై శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు తీవ్రంగా గాపడ్డారు. మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా అబ్బాయి కుంట లేబర్ కాలనీకి చెందిన కొండబత్తుల అనిల్‌కుమార్ అతడి కుమారుడు కొండబత్తుల ప్రదీప్‌తో కలిసి శనివారం ఉదయం వేములవాడ, కొండగట్టు అంజన్న దర్శనం చేసుకొని తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో తాడికల్ పెద్దమ్మతల్లి గుడి వద్ద లారీని ఓవర్టేక్ చేస్తూ ఎదురుగా వచ్చిన కారును ఢీ కొట్టాడు. ఈ ఘటనలో అనిల్‌కుమార్ పరిస్థితి విషమంగా ఉండగా, అతడి కుమారుడికి స్వల్ప గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108 వాహనంలో హుజూరాబాద్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలేవి?

- ఫిర్యాదు చేసినా పట్టించుకోని టౌన్‌ప్లానింగ్ అధికారులు

కరీంనగర్ టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నగరంలో నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అనేకచోట్ల అనుమతి లేకుండా, నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తు భవనాలు, ఇళ్లను నిర్మిస్తున్నారని అనేక మంది ఫిర్యాదులు చేస్తున్నారు. వాటిపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నిస్తున్నారు. నగరపాలకసంస్థ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ విభాగానికి తమస్థలంలో వేరొకరు ఇళ్లు నిర్మిస్తున్నారని, తమపక్కన నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణం చేస్తున్నారని ఫిర్యాదులు అందుతున్నాయి. అధికారులు వాటిని పరిశీలించి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో, మరికొందరు నేరుగా కమిషనర్‌ను, టౌన్‌ప్లానింగ్ అధికారులను కలిసి వినతి పత్రాలను సమర్పిస్తున్నారు. రోజుల కొద్దీ అధికారుల చుట్టూ తిరుగుతున్నారు. మరికొందరు విసిగివేసారి కోర్టులను ఆశ్రయిస్తున్నారు. కొందరికి నోటీసులు జారీచేయడం, మరికొందరి ఫిర్యాదులను పరిశీలించి తాత్కాలికంగా పనులు నిలిపివేయడం, కొందరి భవన నిర్మాణసామగ్రిని తీసుకొచ్చి ఆ తర్వాత వదిలిపెట్టడం మినహా పూర్తిస్థాయిలో చర్యలు తీసుకోవడం లేదు. సమస్యను బట్టి ముడుపులు తీసుకొని నోటీసులిచ్చామని, చర్యలు తీసుకుంటామని సర్దిచెబుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. జ్యోతినగర్‌కు చెందిన పీటర్ అనేవ్యక్తి తన నివాసాన్ని (2-10-1175) ఆనుకొని ఉన్న ఒకరు అనుమతులు, సెట్ బ్యాక్, పార్కింగ్ బహుళ అంతస్తు షాపింగ్ కాంప్లెక్సు నిర్మిస్తున్నారని, తనఇంటికి వెంటిలేషన్ లేకుండా పోతోందని ఆవేదన చెందాడు. 2025 జూన్ 23న మున్సిపల్ కమిషనర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించాడు. దీంతో ఆయన టౌన్‌ప్లానింగ్ డీసీపీకి పరిశీలించి చర్యలు తీసుకోవాలంటూ ఎండార్స్ చేస్తూ ఆయనను కలువాలని సూచించారు.

కమిషనర్ వెంటనే స్పందించడంతో తనకు న్యాయం జరుగుతుందని భావించానని, అయితే దాదాపు ఐదు నెలలుగా కార్యాలయం చుట్టూ, అధికారులచుట్టూ తిరుగు తున్నాచర్య తీసుకోలేదని ఆయన 'ఆంధ్రజ్యోతి'తో వాపోయాడు. ఎన్నోసార్లు అధికారులను కలిసినా వారు న్యాయం చేయక పోగా ఫిర్యాదు చేసిన వ్యక్తికి సపోర్టు చేస్తుండడంతో భవన నిర్మాణం జరుగుతోందని, దీనితో తనతోపాటు ఇరుగుపొరుగు ఇళ్ళకు వెంటిలేషన్ లేకుండా పోతుందని తెలిపాడు. ఇప్పటికైనా అధికారులు నిబంధనలకు విరుద్ధంగా నిర్మించే కట్టడాలపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని కోరాడు. లేనిపక్షంలో కోర్టును ఆశ్రయించి న్యాయపోరాటం చేస్తానని తెలిపాడు. ఇలా ఎంతోమందికి జరుగుతున్న అన్యాయాలపై కమిషనర్ స్పందించి న్యాయం చేయాలని నగర ప్రజలు కోరుతున్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

- ఆందోళనలో ప్రయాణికులు

కథలాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : కథలాపూర్ మండలం దూలూరులో బొమ్మెనకు వెళ్ళే దారిలో ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా ఉండడంతో ప్రయాణికులు ఆందోళన చెందుతున్నారు. కొన్నేళ్లకిందట ఇక్కడ ఇళ్లులేని సమయంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఇళ్ల నిర్మాణాలు పెరగడం వల్ల జనావాసాల మధ్య ట్రాన్స్‌ఫార్మర్‌తో ఇక్కట్లు ఎదురవుతున్నాయని కాలనీ వాసులు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు ట్రాన్స్‌ఫార్మర్‌ను అక్కడి నుంచి తొలగించాలని లేదా రక్షణ చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



దూలూరులో ప్రమాదకరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్

కాలేజీ గ్రౌండ్‌లో ఓపెన్‌జిమ్



జిమ్ చేస్తున్న వాకర్స్

మంథని, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేశారు. మంగళవారం ఉదయం నుంచి జిమ్‌లో వాకర్స్ వినియోగించుకునేలా అందుబాటులోకి తెచ్చారు. దీంతోవాకర్స్ ఉత్సాహంగా జిమ్ చేశారు. వాకింగ్, జాగింగ్ కోసం గ్రౌండ్‌వచ్చే వారికోసం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేసినట్లు మాజీసర్పంచ్ వొడ్నాల శ్రీనివాస్ తెలిపారు. త్వరలోనే ఈ జిమ్‌నుమంత్రి శ్రీధర్‌బాబుతో ప్రారంభోత్సవం చేయి స్తామన్నారు. ఓపెన్ జిమ్‌ను అందరు సద్వినియోగం చేసుకోవాలని వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అంకరి కుమార్ కోరారు.

భద్రాచలం, పాపికొండలకు ప్రత్యేక బస్సు

భగత్‌నగర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తీర్థయాత్రల టూర్‌లో భాగంగా భద్రాచలం, పాపికొండలు వెళ్లేందుకు ప్రత్యేక సూపర్‌లగ్జరీ బస్సును నడిపిస్తున్నట్లు కరీంనగర్-2 డిపో మేనేజర్ ఎం.శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 12వ తేదీన కరీంనగర్ బస్టాండ్ నుంచి రాత్రి 8 గంటలకు బస్సు బయల్దేరుతుందని పేర్కొన్నారు. 13వ తేదీ ఉదయం పాపికొండలు బోటింగ్ అనంతరం అదే రోజు రాత్రి భద్రాచలం, పర్ణశాల దర్శనం అనంతరం అదే రాత్రి వరకు కరీంనగర్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. పెద్దలకు రూ.1800, రూ.1300 చొప్పున చార్జి ఉంటుందని, వివరాలకు 9398658062, 8978383084, 9182610182 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

మల్లన్న సన్నిధిలో హైకోర్టు జడ్జిల పూజలు




ఆలయంలో నందీశ్వరుడి వద్ద న్యాయమూర్తులు

ఓదెల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రసిద్ధిగాంచిన భ్రమరాంబ మల్లికార్జునస్వామి క్షేత్రంలో శనివారం హైకోర్టు జడ్జిలతోపాటు జిల్లాలోని పలు కోర్టుల జడ్జిలు పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయ ముఖ్యఅర్చకుడు వారిని పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతించారు. అనంతరం మల్లికార్జునస్వామి, రామాలయంలో అర్చనలు నిర్వహించారు. ఆలయ ముఖ్య అర్చకులు భద్రయ్య, పంచాక్షరి, సిబ్బంది వారిని సన్మానించి ఆలయ జ్ఞాపికలను అందజేశారు. హైకోర్టు జస్టిస్‌లు పుల్ల కార్తీక్, అలిశెట్టి లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌రావు, జిల్లా జడ్జిలు సునీత, గణేష్, వెంకటేష్, సచిన్‌రెడ్డి, సరిత, మంజుల, భవాని, సుధ, సంధ్యారాణి అలాగే డీసీపీ రామిరెడ్డి, ఏసీపి గజ్జికృష్ణ, ఎస్‌ఐ దీకొండ రమేష్, వకీళ్లు ఆకారపు సర్వోత్తమ్‌రెడ్డి పలువురు పాల్గొన్నారు.

జిల్లా కోర్టు భవనానికి స్థల పరిశీలన..

పెద్దపల్లి రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రాఘవపూర్‌లో జిల్లా కోర్టు భవన నిర్మాణం కోసం కేటాయించిన స్థలాన్ని శనివారం హై కోర్టు జస్టిస్ లక్ష్మీనారాయణ సందర్శించారు. గ్రామంలోని సర్వే నెంబర్ 1072లో కేటాయించిన 10 ఎకరాల స్థలాన్ని పరిశీలించి, స్థలం వివరాలు, భవన నిర్మాణాలకు కేటాయించిన నిధులను న్యాయవాదులను అడిగి తెలుసుకున్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునిత కుంచాల, పెద్దపల్లి డీసీపీ రామిరెడ్డి ,పెద్దపల్లి ఆర్డీవో గంగయ్య , ఏసీపీ గజ్జి కృష్ణ తో పాటు న్యాయవాదులు పాల్గొన్నారు.



పంచాయతీల్లో కీలకం.. ఉప సర్పంచ్

పలు గ్రామాల్లో ఆ పదవికి డిమాండ్

హుజూరాబాద్ రూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవితో పాటు ఉప సర్పంచ్ స్థానం కూడా హాట్ కేక్ అవుతోంది. ఎన్నికల్లో అభ్యర్థులకు మద్దతు నిస్తున్న పార్టీలు ఒక సర్పంచ్ స్థానాన్ని మాత్రమే గెలుచుకోవడం వల్ల ప్రయోజనం లేదని, ఉప సర్పంచ్ స్థానాన్ని కూడా దక్కించుకుంటే గెలుపునకు పరిపూర్ణత సిద్ధిస్తుందని భావిస్తున్నాయి. ఇందుకోసం ఉప సర్పంచ్ స్థానాలపై ప్రధానంగా గురిపెడుతు న్నాయి. సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్‌ను కూడా కైవసం చేసుకోకపోతే పార్టీలు రాజకీయంగా ప్రతి కూలతలను ఎదుర్కోవలసి ఉంటుంది. ఉప సర్పం చ్‌కు చెక్ పవర్ ఉండడం ఈ పదవికి డిమాండ్‌ను పెంచింది. ఉప సర్పంచ్‌ను ఎన్నుకునేది వార్డు సభ్యు లే అయినందు వల్ల ఈ వార్డు సభ్యుల పదవులకు పోటీ తీవ్రంగా ఉంది. రాజకీయంగా పార్టీల నుంచి మద్దతు ఉన్న వారు వార్డు పదవుల్లో సైతం గట్టి పోటీ ఇవ్వడానికి సిద్ధపడుతున్నారు.

● వార్డు సభ్యులే కీలకం..

ఎన్నికల్లో రిజర్వేషన్లు అనుకూలంగా రానిచోట్ల నాయకులు వ్యూహాలు మార్చుకుంటున్నారు. సర్పంచ్ కాకపోయినా చెక్‌పవర్ ఉన్న ఉప సర్పంచ్ పదవిని దక్కించుకుందామని పథకాలు రచించుకుంటున్నారు. సర్పంచ్ నుంచి వార్డు సభ్యుల వరకు అనువైన వారిని ఎంపిక చేసేందుకు నేతలు రాత్రింబవళ్లు సమాలోచనలు చేస్తున్నారు. ఉప సర్పంచ్ కావాలంటే వార్డు సభ్యులే కీలకం కానున్నారు. దీంతో చెప్పిన మాట వినేవారితోనే నామినేషన్ వేయించినట్లు సమాచారం. 50 శాతం సర్పంచ్ స్థానాలు మహిళలకు కేటాయించారు. మహిళా సర్పంచులు గెలిచిన పంచాయతీల్లో ఉప స్పంచ్‌గా గెలుపొంది అధిపత్యం చేలాం ఇంచవచ్చనే ఉద్దేశ్యంతో పలుకుబడి కలి గిన నేతలు వార్డు సభ్యులుగా బరిలోకి దిగారు. పాలకవర్గ సమావేశాలకు సర్పంచ్ గైర్హాజరు అయిన సందర్భాల్లో ఉప సర్పంచ్ అధ్యక్షతనే నిర్వహిస్తారు.

● ఎన్నిక ఇలా...

సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల ఫలితాలు సాయంత్రంలోగా వెలువడుతాయి. ఆ వెంటనే ఉప సర్పంచ్ ఎన్నికను నిర్వహిస్తారు. ఉప సర్పంచ్‌గా పోటీ చేసేవారు ముందుగా నామినేషన్లు దాఖలు చేయడం, వారిని వార్డు సభ్యుల్లో ఒకరు బలపరచడం వంటి తతంగం ముగిసిన తర్వాత ఎన్నికను నిర్వహిస్తారు. వార్డు సభ్యులు చేతులెత్తడం ద్వారా ఎంపికను నిర్వహిస్తారు. ఎవరికి అనుకూలంగా ఎక్కువ మంది వార్డు సభ్యులు చేతులెత్తితే ఆ అభ్యర్థి గెలిచినట్లు ప్రకటిస్తారు. ఒకవేళ ఇద్దరికి సమాన ఓట్లు వస్తే టాస్ ద్వారా గెలుపును నిర్ణయిస్తారు.

● చెక్ పవర్‌తోపాటు అధికారాలు ఉండడం కారణం

● ఉప సర్పంచ్ అధికారాలు

సర్పంచ్‌తో పాటు ఉప సర్పంచ్‌కు కూడా విధులు, బాధ్యతలు ఉంటాయి. ఉప సర్పంచ్ గ్రామ పంచాయతీ సమావేశాల్లో పాల్గొనడం, సర్పంచ్‌కు సహాయం చేయడంతో పాటు సర్పంచ్ లేనప్పుడు పర్పంచ్ విధులను నిర్వహిస్తాడు. పంచాయతీ అభివృద్ధి కార్యక్రమాలు, సజావుగా జరిగేట్టు చూడడం, రోడ్లు, మురుగు కాలువలు, వంతెనలు, బావుల నిర్మాణం, నిర్వహణ వంటి ప్రజా పనులు సక్రమంగా జరుగుతున్నాయో లేదో పర్యవేక్షిస్తాడు. గ్రామాల్లో వీధి దీపాలను ఏర్పాటు చేయడం, వాటి నిర్వహణ బాధ్యతలను కూడా పర్యవేక్షిస్తాడు. పంచాయతీకి సంబంధించిన నిర్ణయాలు తీసుకోవడంలో కీలక పాత్ర పోషిస్తాడు.

అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌గా వేముల లక్ష్మీప్రసాద్



బాధ్యతలు స్వీకరిస్తున్న వేముల లక్ష్మీప్రసాద్

కరీంనగర్ క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాలకు తొలి అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ (ఏడీఓపీ)గా వేముల లక్ష్మీ ప్రసాద్‌ను నియమిస్తూ రాష్ట్ర డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్ శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈమేరకు శనివారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ప్రస్తుతం లక్ష్మీప్రసాద్ రాజన్నసిరిసిల్ల జిల్లా కోర్టులో అడిషనల్ పబ్లిక్‌ప్రాసిక్యూటర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఈసందర్భంగా వేముల లక్ష్మీ ప్రసాద్ మాట్లాడుతూ నేరస్థులకు శిక్షలు విధింపజేయడంలో పోలీసు అధికారులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్ల సమన్వయం అత్యంత ముఖ్యమన్నారు. కేసుల దర్యాప్తు దశ నుంచి కోర్టు వాదనలు పూర్తయ్యే వరకు కలిసి పనిచేస్తే నేరస్తులకు కచ్చితమైన శిక్షలు పడేలా చేయవచ్చన్నారు. లక్ష్మీ ప్రసాద్ నియమాకంపై కరీంనగర్ డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ డి.శరత్, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు మంచికట్ల రాజేశం, మల్యాల ప్రతాప్ అభినందనలు తెలిపారు.

తెలంగాణను అగ్రగామిగా నిలుపుతాం

● మంత్రి పొన్నం ప్రభాకర్



కేంద్రమంత్రి బండి సంజయ్‌కి ఆహ్వానపత్రికను అందిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్

కరీంనగర్ అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రైజింగ్ 2040 విజన్‌తో దేశంలోనే తెలంగాణను అగ్రగామి నిలుపుతామని రాష్ట్రరవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. శనివారం కరీంనగర్‌లో కేంద్ర హోంశాఖ సహాయమంత్రి బండి సంజయ్‌కి గ్లోబల్‌సమ్మిట్ ఆహ్వానపత్రికను అందజేశారు. అనంతరం మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రైజింగ్‌గ్లోబల్ సమ్మిట్‌కి బండిసంజయ్‌ని ఆహ్వానించినట్లు చెప్పారు. పెట్టుబడులు, ఇండస్ట్రియల్ గ్రోత్‌ను తెలంగాణ సమ్మిట్‌ద్వారా సాధిస్తామన్నారు. పదేళ్లలో తెలంగాణ ఆర్థికంగా వెనకబడిందని, రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం సహకరించాలని కోరారు. కేంద్రప్రభుత్వం పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి ఎక్కువ నిధులు ఇస్తోందని, అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాలని అన్నారు. రాజకీయాలకు అతీతంగా అన్నిపార్టీలు అభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని కోరారు.

● సాయి ఈశ్వర్ మృతి బాధాకరం..

బీసీరిజర్వేషన్లపై సాయిఈశ్వర్ మృతి బాధాకరమని మంత్రి పొన్నంప్రభాకర్ అన్నారు. ఇలాంటి బలిదానాలు ఎవరూ చేసుకోవద్దని కోరారు. సాయి ఈశ్వర్ కుటుంబాన్ని అన్నివిధాల ఆదుకుంటామన్నారు. ఎవరు ప్రేరేపించినా మీరు బలిపశువులు కావద్దని సూచించారు.

● కులగణనకు కట్టుబడి ఉన్నాం

కులగణనకు కట్టుబడి ఉన్నామని మంత్రి స్పష్టం చేశారు. 50శాతం రిజర్వేషన్ దాటరాదన్న కేసును సుప్రీంకోర్టులో సవాల్ చేయబోతున్నామన్నారు. బలహీనవర్గాల సోషల్‌జస్టిస్ విషయంలో కాంగ్రెస్ చాంపియన్‌గా ఉందన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలకు వెళ్తున్నట్లు చెప్పారు. గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించడమంటే రిజర్వేషన్లకు వ్యతిరేకం కాదన్నారు. బీసీ రిజర్వేషన్ల కోసం కేంద్రంమీద అందరంకలిసి కొట్లాడుదామని పిలుపునిచ్చారు. చలోఢిల్లీ కార్యక్రమంలో కేంద్రప్రభుత్వం దద్దరిల్లేలా 50శాతంకోటఎత్తివేసేలా ఉద్యమించాలన్నారు. అంకుముందు చైతన్యపురిలోని మహాశక్తి ఆలయంలో పూజలుచేశారు. ఆయనవెంట ప్రభుత్వవిప్ ఆదిశ్రీనివాస్, డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే మేడిపల్లిసత్యం, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ కరీంనగర్ కార్పొరేషన్ అధ్యక్షుడు వైద్యుల అంజన్‌కుమార్, కాంగ్రెస్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న వీసీ ఆచార్య ఉమేష్‌కుమార్

కరీంనగర్ స్పోర్ట్స్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చదువుతోపాటు క్రీడల్లో రాణించాలని, ఉన్నతశిఖరాలకు ఎదగాలని శాతవాహన యూనివర్సిటీ వైస్‌చాన్సలర్ ఉమేష్‌కుమార్ అన్నారు. శనివారం యూనివర్సిటీ మైదానంలో యూనివర్సిటీస్థాయి అంతర్ కళాశాలలో పురుషుల వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. విద్యార్థులు క్రీడల్లో ప్రతిభ చూపి విశ్వవిద్యాలయానికి పేరు తీసుకురావాలనారు. క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యం లభిస్తాయని, స్నేహ సంబంధాలు పెంపొందుతాయని అన్నారు. ప్రతిభచాటిన క్రీడాకారులను ఈ నెల 10 నుంచి 14వరకు కాకినాడ జేఎన్‌టీయూలో నిర్వహించనున్న దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల వాలీబాల్ పోటీలకు ఎంపికచేశారు. ఓఎస్‌డీ హరికాంత్, స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి నజీముద్దీన్ మునావర్, స్పోర్ట్స్ కో-ఆర్డినేటర్ డాక్టర్ మనోజ్ కుమార్, పీఆర్వో పీడీ విజయ్ కుమార్, వ్యాయామ అధికారులు దినేష్, నాగేశ్వర్‌రావు, శ్రీనాథ్, సతీష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

రక్త సంబంధీకుల నుంచి చట్టపరమైన దత్తత



పిల్లలను దత్తత తీసుకున్న దంపతులకు ఉత్తర్వులను అందజేస్తున్న కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్ క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రక్త సంబంధీకుల నుంచి పిల్లలను దత్తత తీసుకోదలిస్తే చట్టబద్ధంగా ఉండాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ-మిషన్ వాత్సల్య ఆధ్వర్యంలో కరీంనగర్‌కు చెందిన పిల్లలు లేని దంపతులు వారి రక్త సంబంధీకుల నుంచి 12నెలల బాబును చట్టపరమైన దత్తత తీసుకున్నారు. వీరికి కలెక్టర్ పమేలా సత్పతి శనివారం ఉత్తర్వులు అందజేశారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పిల్లలు లేని దంపతులు చట్టబద్ధమైన దత్తత తీసుకోవాలన్నారు. రక్త సంబంధీకుల నుంచి దత్తత తీసుకోవాలనుకునే వారు జిల్లా పరిషత్‌లోని జిల్లా సంక్షేమ అధికారికార్యాలయంలో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాలల పరిరక్షణ అధికారి (డీసీపీఓ) పర్వీన్, ఎల్‌పీవో రాజు, యం రాజ్ కుమార్, రమేష్, మిషన్ వాత్సల్య పాల్గొన్నారు.

పెద్దంపేట ఎన్నిక నిలిపివేస్తూ ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు

యైటింక్లయిన్‌కాలనీ, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పెద్దపల్లిజిల్లా రామగిరి మండ లం పెద్దంపేట గ్రామ పంచాయతీ ఎన్నికను నిలిపివేస్తూ శనివారం రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఉత్తర్వులను జారీ చేసింది. మొదటివిడత ఎన్నికల్లో భాగంగా ఈనెల 11న పెద్దంపేట పంచాయతీ ఎన్నికలు జరగాల్సి ఉన్నది. పెద్దంపేట పంచాయతీకి సంబంధించి హైకోర్టులో కేసు ఉన్నందున 11న ఎన్నికను నిర్వహించవద్దని ఎన్నికల కమిషన్ జిల్లా అధికారులకు ఉత్తర్వులు జారీచేసింది. ఈనెల 15న ఎన్నికపై తుదితీర్పు వెలువడనుండడంతో అప్పటివరకు ఎన్నికల ప్రక్రియను నిలిపివేయాలని కమిషన్ ఉత్తర్వుల్లో పేర్కొన్నది. కోర్టు తీర్పును అనుసరించి అనంతరం ఎన్నికలు నిర్వహించే అవకాశాలు ఉన్నాయి.

నరసింహుడి సన్నిధిలో భక్తుల రద్దీ



ధర్మపురిలో స్వామి వారిని దర్శించుకుంటున్న భక్తులు



కొండగట్టు అంజన్న ఆలయం ముందు భక్తులు

ధర్మపురి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలోని లక్ష్మీ నరసింహస్వామి సన్నిధిలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. దీంతో లక్ష్మీనరసింహస్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, నరసింహహోమం, స్వామి వారల నిత్య కల్యాణం జరిపించి పూజలు చేశారు యమ ధర్మరాజు ఆలయం వద్ద గండ దీపంలో నూనె పోసి భక్తి శ్రద్దలతో పూజలు జరిపారు. రామలింగేశ్వర స్వామి ఆలయం వద్ద నాగదేవతకు, రావి చెట్టు ఆంజనేయ స్వామివారికి అర్చకులు క్షీరాభిషేకం నిర్వహించారు.

స్వామి వారలకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్‌కుమార్‌శర్మ మంత్రోచ్చరణల మధ్య అర్చకులు పూజలు నిర్వహించారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్, ధర్మకర్తల మండలి చైర్మన్ జక్కు రవీందర్, ధర్మకర్తలు, అర్చకులు, సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు.

కొండగట్టులో భక్తుల రద్దీ..

మల్యాల: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధానం శనివారం భక్తులతో రద్దీగా మారింది. వేలాదిగా వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయఅధికారులు పర్యవేక్షించారు. ఘాట్‌రోడ్డు, జేఎన్‌టీయూ మార్గం వాహనాలతో నిండిపోయింది.

క్రీడలతో మానసికోల్లాసం

● అదనపు కలెక్టర్ రాజాగౌడ్



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాజాగౌడ్

జగిత్యాల, డిసెంబరు 6 (ఆంధ్ర జ్యోతి): క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని జగిత్యాల జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజాగౌడ్ అన్నారు. శనివారం జగిత్యాలలోని స్థానిక వివేకానంద మినీ స్టేడియంలో జిల్లాస్థాయి పీఎంశ్రీ స్కూల్‌స్పోర్ట్ మీట్ ముగింపు కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ రాజాగౌడ్, జిల్లావిద్యాశాఖ అధికారి కె.రాములు పాల్గొన్నారు. జిల్లాలోని 16పీఎంశ్రీ స్కూ ల్స్‌కి నిర్వహించిన కబడ్డీ, కోకో, వాలీబాల్, ఫుట్బాల్ ఆటలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ రాజాగౌడ్ మాట్లాడుతూ జిల్లా విద్యార్థులు రాష్ట్రస్థాయి లోని పలు పోటీల్లో ప్రతిభ కనపరచి జిల్లాపేరును నిలబెడుతున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారులు చిప్ప సత్య నారాయణ, కొక్కుల రాజేష్, కోరుట్ల మహేష్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ చక్రధర్, పెటాఅధ్యక్షుడు విశ్వప్రసాద్,పిడుగు భాస్కర్, కృష్ణప్రసాద్ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

సర్పంచ్ అభ్యర్థిపై ఫిర్యాదు

ఎలిగేడు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని లాలపల్లి గ్రామపంచాయతీ ఎన్నికల్లో పోటీచేసేందుకు నామినేషన్ వేసిన సర్పంచ్ అభ్యర్థి ఏలేటి వెంకట్ రెడ్డిపై ఎన్నికల రిటర్నింగ్ అధికారి, ఎంపీడీఓ భాస్కర్ రావుకు శనివారం ఫిర్యాదు చేసినట్లు మరో సర్పంచ్ అభ్యర్థి బాసంపల్లి రాజేష్ తెలిపారు. ఏలేటి వెంకట్ రెడ్డి ఇప్పటికే సింగిల్ విండో డైరెక్టర్‌గా కొనసాగుతున్నాడని అభ్యంతరం వ్యక్తం చేశారు. దీనిపై పరిశీలన చేసి చర్యలు తీసుకోవాలని కోరినట్లు పేర్కొన్నారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, మాజీ అధ్యక్షుడు తానిపర్తి మోహన్ రావు, నాయకులు న్యాతరి పోచయ్య, బద్దం తిరుపతిరెడ్డి, బాసంపల్లి వినోద్, సుజికి రాజేశ్వర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు



డ్రైనేజీపై ఏర్పడిన గొయ్యి

ముత్తారం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ముత్తారం మండలం ఓడేడు గ్రామంలో 6వ వార్డుకు వెళ్లే దారి ప్రమాదకరంగా మారింది. డ్రైనేజీ మీద నిర్మించిన రోడ్డు ఒకవైపు కూలి పెద్ద గొయ్యి ఏర్పడిరది. దీంతో ఈ వార్డుకు వెళ్లే వాహనదారులు నానా ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఈ దారి గుండా వచ్చే కార్లు, ద్విచక్రవాహనాలు ఈ డ్రైనేజీలో పడి వాహనాలు దెబ్బతినడంతోపాటు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు సంధించి మరమ్మతులు చేపట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ఇప్పపల్లి రైతులతో ఆర్డీవో సమావేశం



ఆర్డీవోకు వినతి పత్రం అందిస్తున్న రైతులు

కథలాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇప్పపల్లి రైతులతో శనివారం కోరుట్ల ఆర్డీఓ జివాకర్‌రెడ్డి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. సూరమ్మ చెరువు ఎడమ కాలువ నిర్మాణంలో భాగంగా రైతులు భూములు కోల్పోతున్న నేపథ్యంలో నష్ట పరిహారం చెల్లింపుకుగాను అవార్డ్ ఎంక్వైరీ నిర్వహించారు. ప్రభుత్వ భూవిలువ ప్రకారం ఎకరాకు రు.8.60లక్షలు చెల్లించడానికి నష్టపరిహారం విడుదల చేసిందని రైతులకు సూచించారు. కాగా బహిరంగ మార్కెట్‌లో ఎకరాకు రు. 50 లక్షలు ధర ఉందని ఆ ధర చెల్లించాలని ఆర్డీఓకు రైతులు వినతి పత్రం అందజేశారు. అయితే నిర్ణీత డబ్బులు కోర్టులో డిపాజిట్ చేసి పనులు ప్రభుత్వం ప్రారంభిస్తుందని రైతులతో ఆర్డీఓ చెప్పారు. ఈ సందర్భంగా తహసీల్దార్ వినోద్, రైతులు ఉన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో మోడల్ స్కూల్ విద్యార్థి ప్రతిభ



చేవెళ్లలో బహుమతి అందుకుంటున్న విద్యార్థి వెంకటేష్

వెల్గటూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయిలో చేవెళ్లలో నిర్వహించిన ఇగ్నైట్-2025 సైన్స్ ఎగ్జిబిషన్‌లో వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి మోడల్‌స్కూల్ విద్యార్థి సత్తా చాటాడు. రాష్ట్రవ్యాప్తంగా 194మోడల్ స్కూళ్లు పాల్గొన్న సైన్స్ ఎగ్జిబిషన్‌లో వెంకటేష్ అనే విద్యార్థి గైడ్ టీచర్ సందీప్‌రాజ్ సహాయంతో తయారు చేసిన ఉమెన్ సేఫ్టీ మిషన్‌కు కన్సోలేషన్ బహుమతి సాధించాడు. రాష్ట్రస్థాయిలో బహుమతి సాధించిన వెంకటేష్‌ను, గైడ్‌టీచర్ సందీప్‌రాజ్‌ను ప్రిన్సిపాల్ కృష్ణ ప్రసాద్, పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

అయ్యప్ప ఆరట్టు ఉత్సవం

కోరుట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో అయ్యప్ప ఆరట్టు ఉత్సవం వైభవంగా జరిగింది. పట్టణంలోని అయ్యప్ప స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలను నిర్వహించారు. పట్టణంలోని బాలాజీ రోడ్డులో ఉన్న ఆంజనేయ స్వామి దేవాలయంలో ఉత్సవ మూర్తులకు ప్రత్యేక పూజలను నిర్వహించి మహదేవ స్వామి దేవాలయానికి భజన కార్యక్రమాలతో తరలించారు. కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో అయ్యప్ప జ్ఞాన సరస్వతి దేవాలయ గౌరవ అధ్యక్షుడు చిద్రాల నారాయణ, అభివృద్ధి కమిటి అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

●రాయికల్: రాయికల్ పట్టణంలో అయ్యప్ప ఆరట్టు ఉత్సవం ఘనంగా జరిగింది. అయ్యప్ప ఉత్సవ విగ్రహాన్ని శనివారం పట్టణ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం పట్టణ శివారులోని పెద్ద చెరువుకు తీసుకువెళ్లి చక్ర స్నానాలు నిర్వహించారు.

సనాతన ధర్మాన్ని పాటించాలి

జగిత్యాల టౌన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): భారతదేశం బాగుంటేనే ప్రపంచ దేశాలన్ని బాగుంటాయని శృంగేరి శారదా పీఠ ఆస్థాన పండితులు డా. బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి పేర్కొన్నారు. జగిత్యాల పట్టణానికి చెందిన జగదాయల ఆధ్యాత్మిక బృందం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని రెడ్డి కన్వెన్షన్ హాల్ తొమ్మిది రోజుల పాటు సంతోష్ కుమార్ శాస్త్రి ఆధ్వర్యంలో నిర్వహించనున్న మహాభారత నవాహ్నిక ప్రవచన జ్ఞాన యజ్ఞ కార్యక్రమం శనివారం ప్రారంభమైంది. డా. బాచంపల్లి సంతోష్ కుమార్ శాస్త్రి మొదట వాసవి మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రెడ్డి కన్వెన్షన్ హాల్ వరకు శోభయాత్ర నిర్వహించారు. అనంతరం మహాభారత నవాహ్నిక ప్రవచన జ్ఞాన యజ్ఞమును ప్రారంభించారు. కార్యక్రమంలో ఆధ్యాత్మిక బృందం సభ్యులు చెట్ల చంద్రశేఖర్, శీల శ్రీనివాస్, మార కైలాసం, కోటగిరి శ్రవన్ కుమార్, భోనగిరి రాంనారాయణ, తవుటు రాంచంద్రం, టివి సూర్యం, బాలపెల్లి రవిందర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆసుపత్రి తనిఖీ

మల్యాల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మల్యాలలో ప్రభుత్వ ప్రాథమిక ఆసుపత్రిని శనివారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డా. జైపాల్‌రెడ్డి ఆకస్మికంగా సందర్శించారు. ఆసుపత్రిలోని ఫార్మసీ, ల్యాబ్ తనిఖీ చేసి ఔషదాల నిర్వహణ, రికార్డులు పరిశీలించారు. డయగ్నస్టిక్ కార్యకలాపాలపై పలు సూచనలు చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో వెంట వైద్యురాలు మౌనిక ఉన్నారు.

విద్యార్థుల ప్రతిభ

కోరుట్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని టాలెంట్ టెస్టులో విద్యార్థులు ప్రతిభ కనపరిచినట్లు ప్రిన్సిపాల్ జైనపురం ప్రవీణ్ కుమార్ శనివారం తెలిపారు. గౌతమ్ మాడల్ స్కూల్ ఆధ్వర్యంలో నిర్వహించిన గౌతమ్ టాలెంట్ టెస్టులో కోరుట్ల బ్రాంచ్ విద్యార్థులు ప్రతిభ కనపరిచి నగదు పురస్కారంకు ఎంపికయినట్లు తెలిపారు. ప్రథమ బహుమతి పొందిన విద్యార్థులకు రూ.1200, ద్వితీయ బహుమతి రూ.800, తృతీయ బహుమతి రూ.500 విద్యా ర్థులకు అందించినట్లు ప్రిన్సిపాల్ తెలి పారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ ప్రవీణ్, డీన్ రాందాస్‌లు అభినందించి సన్మానించారు.

బాబాసాహెబ్ అంబేద్కర్‌కు ఘన నివాళి

జగిత్యాల టౌన్, డిసెంబరు 06(ఆంధ్రజ్యోతి): బడుగు బలహీన వర్గాలకు స్వేచ్ఛా స్వాతంత్ర్యం అందించిన మహనీయుడు డా. బి. ఆర్ అంబేద్కర్ అని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ అన్నారు. భారత రాజ్యంగా నిర్మాత డా. బి. ఆర్ అంబేద్కర్ వర్ధంతిని పురస్కరించుకొని శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలోని తాహసీల్ చౌరస్తాలో గల అంబేద్కర్ విగ్రహానికి ఎమ్మెల్యే డా. సంజయ్‌కుమార్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జగిత్యాల జిల్లా కేంద్రంలో ఉన్న అబేంద్కర్ భవనంను అంబేద్కరిస్టులకు అందుబాటులోకి తీసుకు వస్తానని పేర్కొన్నారు.

●మాజి మంత్రి జీవన్ రెడ్డి, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజంగి నందయ్య ఆధ్వర్యంలో కాంగ్రెస్ శేణులు జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్ నుండి తాహసీల్ చౌరస్తా వద్దకు ర్యాలీగా వచ్చి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. భారత్ సురక్ష సమితి, సమరసత వేదిక ఆధ్వర్యంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏసీఎస్ రాజు, అక్కినపల్లి కాశీనాథం, చిట్ల గంగాధర్‌లు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమాలలో మున్సిపల్ కమీషనర్ స్పందన, మాజి మున్సిపల్ చైర్మన్లు అడువాల జ్యోతి లక్ష్మణ్, గిరి నాగభూషణం, టిపిసిసి కార్యదర్శి బండ శంకర్, మాజి కౌన్సిలర్లు బాలే శంకర్, కల్లెపల్లి దుర్గయ్య, మాజి ఎంపీపీ దర రమేష్‌బాబు పాల్గొన్నారు.

●జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలోని మోరపల్లి గ్రామంలో శనివారం అంబేద్కర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈకార్యక్రమంలో బొల్లె అనిల్, బొల్లె గంగారాం, గంగాధర్, నడిపిలక్ష్మణ్, సతీష్, రమేష్, అశోక్, ప్రశాంత్, వినయ్, గంగారాం, గంగాధరి పాల్గొన్నారు.

●కోరుట్ల: అంబేడ్కర్ ఆశయ సాధనకై ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ అన్నారు. శనివారం పట్టణంలోని మున్సిపల్, అంబేడ్కర్ సంఘ ఆధ్వర్యంలో నిర్వహించిన వర్ధంతి వేడుకలో ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొన్నారు. అదే విధంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు జువ్వాడి కృష్ణారావు తన అనుచరులతో కలిసి అంబేడ్కర్ విగ్రహంకు నివాళ్ళను అర్పించారు. బీజేపీ నాయకులు వేడుకలో పాల్గొన్ని అంబే డ్కర్‌కు నివాళ్ళను అర్పించారు. పట్టణంలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలలో అంబేడ్కర్ వర్ధంతి వేడుకలను నిర్వహిచారు. సి. ప్రభాకర్ భవనంలో సిపిఐ నాయకులు అంబెడ్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళ్లను అర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ రవీంధర్‌లతో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.





జగిత్యాల, కోరుట్లలో అంబేద్కర్ విగ్రహాలకు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యేలు సంజయ్ కుమార్, డాక్టర్ సంజయ్

●కోరుట్ల రూరల్: మండలంలోని అన్ని గ్రామాలలో శనివారం అంబేడ్కర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ సంఘ నాయకులతో కలిసి వివధ పార్టీల నాయకులు అంబెడ్కర్ విగ్రహంకు పూలమాల వేసి నివాళ్లను అర్పించారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

●మెట్‌పల్లి టౌన్: బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధంతి వేడుకలను పట్టణంలోని పలువురు ప్రముఖులు, పలు పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు, ఆయా సంఘాల ప్రతినిధులు నిర్వహించారు. శనివారం పట్టణంలోని ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ నివాళు లర్పించారు.

●కోరుట్ల నియోజకవర్గ ఇంచార్జి, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జువ్వాడి నర్సింగరావు పట్టణంలోని ఆయన స్వగృహం జువ్వాడి భవన్‌లో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు జెట్టి లింగం, రాంప్రసాద్, జట్టి లక్ష్మణ్, పుల్లూరు వెంకటేష్, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

●పట్టణంలో అంబేద్కర్ 69వ వర్ధంతి వేడుకలను బీజేపీ జిల్లా అధ్యక్షుడు రాచకొండ యాదగిరి బాబు, పట్టణ అధ్యక్షుడు బొడ్ల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డేపల్లి శ్రీనివాసన్, గుంటుక సదాశివం, ప్రధాన కార్యదర్శి కుడుకల రఘు, పట్టణ ఉపాధ్యక్షురాలు మద్దెల లావణ్య పాల్గొన్నారు.

● అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కాంగ్రెస్ పట్టణ మాజీ అధ్యక్షుడు మహమ్మద్ ఖుతుబోద్దిన్ పాషా అన్నారు. శనివారం పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయ సమీపంలోని అంబేద్కర్ పార్కులో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

●అంబేద్కర్ 69వ వర్ధంతిని సుఖీభవ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించి, నివాళులర్పించారు. కార్యక్రమంలో సుఖీభవ వ్యవస్థాపకులు బొక్కెనపల్లి నాగరాజు,రెవెన్యూ డివిజన్ సాధన కమిటీ నాయకులు నాంపల్లి గట్టయ్య పాల్గొన్నారు.

●రాయికల్: మండలంలోని భూపతిపూర్‌లో శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ వర్ధంతి నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, అంబేద్కర్ గ్రామ శాఖ అధ్యక్షుడు రవుట్ల లక్ష్మణ్ పాల్గొన్నారు.

●కథలాపూర్: మండలంలో అంబేద్కర్ వర్ధంతి వేడుకలు ఘనంగా నిర్వహిచారు. పెగ్గెర్ల, గంబీర్‌పూర్, తక్కళ్ళపల్లి, సిరికొండ, కథలాపూర్ గ్రామాల్లో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు.

●గొల్లపల్లి: దేశంలోని అన్ని వర్గాల ప్రజలకు ఓటు హక్కు కల్పించిన హక్కుల ప్రదాత డా.బీఆర్. అంబేద్కర్ అని వక్తలు కొనియాడారు. మండల కేంద్రంతో పాటు శ్రీరాములపల్లె, చిల్వాకోడూర్, గోవిందు పల్లె, మల్లన్న పేట, వెంగళాపూర్, రాపల్లె, ఇబ్రాజ్ పల్లె, వెన్గుమట్ల, గుంజపడుగు, తిర్మలాపూర్ (పీడీ), రంగదాముని పల్లె తదితర గ్రామాల్లో అంబేద్కర్ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో అంబేద్కర్ యువ జన సంఘాలు, బహుజన సంఘాల నాయకులు పాల్గొన్నారు.

●కొడిమ్యాల: మండల కేంద్రంలో బస్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శనివారం అంబేద్కర్ సంఘాల నాయకులు బాబాసాహెబ్ అంబేద్కర్ వర్ధతిని ఘనంగా జరుపుకున్నారు.

సాయిశ్వరచారికి ఘన నివాళి

జగిత్యాల అర్బన్, డిసెంబర్ 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం బిసి రిజర్వేషన్‌లు ఇస్తామని మాట తప్పినందుకు నిరసనగా ఆత్మార్పన చేసుకున్న సాయిశ్వర చారికి బిసి సంఘం ఆధ్వర్యంలో శనివారం రాత్రి ఘన ంగా నివాళులు అర్పించారు. స్థానిక తహసీల్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో బిసి నాయకులు మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్‌లు ఇస్తామని చేసిన కామరెడ్డి డిక్లరేషన్‌ను రద్దు చేయడం వల్ల మనోవేదనకు గురై సాయిశ్వర చారి అగ్నికి ఆహుతి య్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బిసి సంఘం నాయకులు గాజుల శ్రీనివాస్, చింతల గంగాధర్, గాజుల నాగరాజు, పెండెం గంగాధర్, గందం జలజ, గూడూరి రాజు, గుగ్గిళ్ళ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

●కొడిమ్యాల: సాయి ఈశ్వరాచారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ మండల కేంద్రమైన కొడిమ్యాలలోని అంగడి బజారులో శనివారం రాత్రి బీసీ సంఘాల నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో మండల కేంద్రంలో బీసీ సంఘాల నాయకులు, బీసీ ప్రజలు పాల్గొన్నారు.

హోంగార్డుల సేవలు వెలకట్టలేనివి



హోంగార్డుల గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల టౌన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో హోంగార్డుల సేవలు వెలకట్టలేనివని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. 63వ హోంగార్డ్ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో శనివారం హోంగార్డ్ ఆఫీసర్స్ పరేడ్‌ను ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ హోంగార్డ్ ఆఫీసర్స్ గౌరవ వందనం స్వీకరించి పరేడ్‌ను తిలకించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ హోంగార్డ్ వ్యవస్థ నేడు దేశవ్యాప్తంగా పోలీస్ విభాగానికి ఒక బలమైన సహాయక శక్తిగా ఎదిగి, నిస్వార్థ సేవ అనే నినాదంతో ప్రజాసేవలో ముందుండి పనిచేస్తోందన్నారు. ట్రాఫిక్ నిర్వహణ, ఉత్సవాలు, ఎన్నికల బందోబస్తు, నైట్ పెట్రోలింగ్, నేరాల నిరోధం వంటి ఏ పనిలోనైన హోంగార్డ్‌లు నిబద్ధతో పని చేస్తూ ప్రజల భద్రత కోసం అందిస్తున్న సేవలు అభినందనీయం అని అన్నారు. ప్రతికూల వాతవరణం ఉన్నప్పటికీ విధుల్లో నిజాయతీగా పని చేస్తున్నందుకు ఎస్పీ వారిని ప్రశంసించారు. హోంగార్డుల సంక్షేమం, శిక్షణ, నైపుణ్యాభివృద్ధికి పోలీస్ శాఖ పూర్తి సహకారం కొనసాగిస్తూ, మెరుగైన పని వాతావరణం కల్పించేందుకు కృషి చేస్తామని తెలిపారు. సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల వినియోగం, రోడ్డు ప్రమాదాలు, మూఢ నమ్మకాలు వంటి సామాజిక సమస్యలపై అవగాహన కల్పించడంలో కళాబృందం చేస్తున్న సేవలు అబినందనీయమని అన్నారు. వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీల్లో విజయం సాధించిన హోంగార్డ్‌లకు ఎస్పీ బహుమతులను ప్రదానం చేశారు. విధులలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన హోంగార్డ్ ఆఫీసర్లకు ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శేషాద్రినిరెడ్డి, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్‌లు కిరణ్‌కుమార్, సైదులు, వేణు, రిజర్వ్ ఎస్‌ఐలు, హోంగార్డులు పాల్గొన్నారు.

ముగిసిన నామినేషన్ల పర్వం

(ఐదో పేజీ తరువాయి)


చేయించడంపై దృష్టి సారించారు. ఇందుకు అనుగుణంగా తమ అనుచరులు, కార్యకర్తలు, ప్రత్యేక వ్యక్తులను కార్యరంగంలోకి దించుతున్నారు. అభ్యర్థులు ఎక్కువగా పోటీలో ఉన్నట్లయితే క్రాస్ ఓటింగ్ జరిగే అవకాశాలుంటాయని పలువురు అభ్యర్థులు భావిస్తున్నారు. దీంతో రాజకీయ పాచికలు ఉపయోగించి ఉప సంహరణ చేయించడంపై నేతలు దృష్టి సారించారు.

●క్రాస్ ఓటింగ్‌పై గుబులు...

జిల్లాలో పంచాయతీ ఎన్నికల్లో క్రాస్ ఓటింగ్‌పై అభ్యర్థులకు, రాజకీయ పక్షాల నేతలకు గుబులు పట్టుకుంది. ఎన్నికల బరిలో పదుల సంఖ్యలో అభ్యర్థులు రంగంలో దిగడంతో ఓట్లు చీలిపోతాయన్న ఆందోళనకు గురవుతున్నారు. ప్రధానంగా మండల కేంద్రాలు, మేజర్ గ్రామ పంచాయతీల్లో పోటీకి దిగిన అభ్యర్థులు క్రాస్ ఓటింగ్‌పై ఆలోచన చేస్తున్నారు. ఆయా కులాలు, సంఘాలకు చెందిన వ్యక్తులు, నేతలు పలు పార్టీల మద్దతుతో, స్వతంత్రంగా నామినేషన్లు దాఖలు చేయడంతో వందల సంఖ్యలో ఓట్లు పడకుండా ఉంటాయని అభిప్రాయ పడుతున్నారు. ఒక్కో అభ్యర్థి కనీసం వంద నుంచి ఆపై ఓట్లను రాబట్టుకున్నా లెక్కింపులో ప్రతీ ఓటుకు విలువ ఏర్పడుతుందన్న ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు అభ్యర్థులకు కేటాయించే గుర్తుల వల్ల సైతం క్రాస్‌ఓటింగ్ జరిగే అవకాశాలుంటాయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నారు. గుర్తులను పోలియున్న ఇతర గుర్తులను అభ్యర్థులకు కేటాయిస్తే పల్లె ప్రజలు పొరపాటున ఇతర గుర్తులపై ఓటు వేసి ప్రమాదం పొంచి ఉందన్న ఆందోళన పంచాయతీ అభ్యర్థుల్లో నెలకొంది.

●ఉపసంహరణపై దృష్టి...

జిల్లాలోని మూడో విడత పంచాయతీల్లో భారీగా నామినేషన్లు దాఖలు కావడంతో ఓటు చీలిపోకుండా ఉండడానికి అభ్యర్థులు ఉప సంహరణ వ్యవహారంపై దృష్టి సారించారు. గతంలో తమ వర్గంతో పనిచేసి ప్రస్తుతం నామినేషన్లు వేసిన అభ్యర్థులను బుజ్జగించి ఉప సంహరణ చేయించడానికి ప్రయత్నిస్తున్నారు. బుజ్జగింపులతో పాటు తాయిలాలు సైతం అందించడానికి రాజకీయ పక్షాలు, అభ్యర్థులు పావులు కదుపుతున్నాయి. నామినేషన్ వేసిన అభ్యర్థుల్లో తమకు ఇబ్బంది కలిగించే వ్యక్తులు ఎవరు..సంబందిత అభ్యర్థులను బుజ్జగించడం ఎలా అన్న అంశాలపై దృష్టి సారించారు. తాము గుర్తించిన వ్యక్తులను నామినేషన్లను ఉప సంహరించడానికి సామ, దాన, దండోపాయాలను అభ్యర్థులు ప్రయోగించడానికి సిద్ధమవుతున్నారు. ఉత్కంఠకు దారి తీస్తున్న పంచాయతీ ఎన్నికల చదరంగంలో బరిలో నిలిచేదెవరూ...గెలిచేదెవరూ అన్న ఆసక్తి పల్లె ఓటర్లలో చోటుచేసుకుంటోంది.



సర్పంచ్ బరిలో మామ.. కోడలు



సత్యనారాయణగౌడ్



రాధిక

రాయికల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలం శ్రీరాంనగర్ గ్రామ సర్పంచ్ స్థానానికి మామ తాళ్లపెల్లి సత్యనారాయణ గౌడ్, కోడలు తాళ్లపెల్లి రాధిక బరిలో నిలిచారు. శ్రీరాంనగర్ సర్పంచ్ పదవి బీసీ జనరల్‌కు రిజర్వ్ అయింది. దీంతో రెండో విడత ఎన్నికలు జరిగే శ్రీరాంనగర్ సర్పంచ్ స్థానానికి మొదట తండ్రి తాళ్లపెల్లి సత్యనారాయణగౌడ్, కుమారుడు తాళ్లపెల్లి శ్రీరామ్‌గౌడ్, కోడలు తాళ్లపెల్లి రాధిక నామినేషన్ వేశారు. శనివారం కుమారుడు తాళ్లపెల్లి శ్రీరామ్‌గౌడ్ తన నామినేషన్‌ను ఉపసంహ రించుకున్నాడు. దీంతో సర్పంచ్ స్థానానికి కోడలు తాళ్లపెల్లి రాధిక, మామ తాళ్లపెల్లి సత్యనారాయణగౌడ్ పోటీ పడుతున్నారు. శ్రీరాంనగర్ సర్పంచ్ స్థానానికి నామినేషన్ల ఉపసంహరణ అనంతరం మొత్తం నలుగురు అభ్యర్థులు బరిలో ఉన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

రాయికల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో పోలీస్ అధికారులు, సిబ్బంది విధి నిర్వహణలో ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని జగిత్యాల జిల్లా అదనపు ఎస్పీ శేషాద్రిని రెడ్డి అన్నారు. రాయికల్ పట్టణ పోలీస్ స్టేషన్‌ను శనివారం తనిఖీ చేశారు. అనంతరం అల్లీపూర్ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించారు. వారి వెంట డీఎస్పీ రఘుచందర్, రూరల్ సీఐ సుధాకర్, ఎస్సై సుధీర్‌రావు ఉన్నారు.

ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలి

కథలాపూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 11న జరగనున్న మొదటి విడత పంచాయతీ ఎన్నికల విధులకు హాజరు కానున్న సిబ్బందికి శనివారం మండల వనరుల కేంద్రంలో జిల్లా ఎన్నికల పరిశీలకుడు రమేశ్ శిక్షణ ఇచ్చారు. ఓటరు జాబితాను క్షుణ్ణంగా పరిశీలిస్తూ ఓటింగ్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని కోరారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శంకర్ నాయక్, ఎంఈఓ లోకిని శ్రీనివాస్, సిబ్బంది ఉన్నారు.

తుది విడతకు ముగిసిన నామినేషన్ల పరిశీలన

ధర్మపురి, డిసెంబరు 6: ధర్మపురి మండలంలో మూడవ విడత సర్పంచ్, వార్డు సభ్యుల నామినేషన్ల పరిశీలన ప్రక్రియ శనివారం జరిగింది. జిల్లా ఎన్నికల సహాయ అధికారి, ఇన్‌చార్జి ఎంపీడీవో నరేష్‌కుమార్ సమక్షంలో మండలంలోని ఎనిమిది క్లస్టర్ల పరిధిలో గల 25 గ్రామపంచాయితీ, 224 వార్డు సభ్యుల స్థానాలకు సంబంధించి ఎన్నికల రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు పరిశీలన చేశారు. ఉదయం నుంచి పరిశీలన పూర్తి అయ్యే వరకు 112 మంది సర్పంచ్ అభ్యర్థులు దాఖలు చేసిన 150 నామినేషన్ సెట్లు, 424 మంది వార్డు సభ్యుల అభ్యర్థులు దాఖలు చేసిన మొత్తం 494 నామినేషన్ సెట్లను క్షుణ్ణంగా పరిశీలన చేశారు. అభ్యంతరాలు ఉంటే ఫిర్యాదు చేయాలని, ఎన్నికల్లో పోటీ చేసే భ్యర్థులకు తెలిపారు. ఎవరి నుంచి కూడ ఎలాంటి ఫిర్యాదులు, అభ్యంతరాలు రాలేదు. దీంతో అధికారులు నామినేషన్ల పరిశీలన పూర్తి చేసి అన్ని సక్రమంగా ఉన్నట్లు ఆమోదించారు.

●వెల్గటూర్ మండలంలో..

వెల్గటూర్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వెల్గటూర్ మండలంలోని 19 గ్రామ పంచాయతీలకు గాను 86 మంది బరిలో నిలిచారు. మండలం లోని స్తంభంపల్లి, వెల్గటూర్, శాఖాపూర్, ముత్తునూర్, పైడిపల్లి, క్లస్టర్ గ్రామ పంచాయితీలలో నామినేషన్లు స్వీకరించిన అధికారులు శనివారం స్క్రూటినీ పూర్తి చేశారు. 19 గ్రామ పంచాయితీలలో సర్పంచ్ స్థానాలకు 86 మంది పోటీలో నిలువగా, 168 వార్డు స్థానాలకు 358 మంది అభ్యర్థులు పోటీలో నిలిచినట్లు ఎంపీడీవో వెంకట ప్రసాద్ తెలిపారు.

●గొల్లపల్లి మండలంలో..

గొల్లపల్లి: మండలంలో మొత్తం 27 సర్పంచ్ పదవులకు గాను 126 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. మండలంలోని మొత్తం 246 వార్డు స్థానాలకు గాను మొత్తం 565 మంది అభ్యర్థులు పోటిలో నిలిచారు. మండలంలో మొత్తం 27 సర్పంచ్ పదవులకు 128 మంది అభ్యర్థులు నామినేషన్లను దాఖలు చేయగా అందులో రంగదాముని పల్లె, దమ్మన్న పేట రెండు గ్రామాల్లో ఒక్కో అభ్యర్థి చొప్పున ఇద్దరు అభ్యర్థులు సరైన పత్రాలు సమర్పించకపోవడంతో స్క్రూటినిలో తరిస్కరించబడ్డాయని, చివరికి 126 మంది అభ్యర్థులు బరిలో నిలిచారని ఎంపీడీవో రవీంధర్ రావు తెలిపారు. అలాగే మొత్తం 246 వార్డు స్థానాలకు గాను 567 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా, అందులో రాపల్లె, బీబీరాజ్ పల్లె గ్రామాల్లో ఒక్కోటి చొప్పున సరైన పత్రాలు సమర్పించకపోవడంతో ఇద్దరు అభ్యర్థుల నామినేషన్లను తిరస్కరించామని ఎంపీడీవో పేర్కొన్నారు. 565 మంది అభ్యర్థులు గ్రామ పంచాయతీ ఎన్నికల్లో పోటిలో నిలవగా 21 వార్డు స్థానాల్లో సింగిల్ నామినేషన్లు దాఖలైనట్లు ఎంపీడీవో వివరించారు.

పెగడపల్లి మండలంలో ..

పెగడపల్లి: పెగడపల్లి మండలంలోని పలు గ్రామాలలో 43 వార్డు సభ్యుల స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. మండలంలోని 23 గ్రామాలకు గాను 216 వార్డు స్థానాలు ఉండగా 43 ఏకగ్రీవం కాగా 173 వార్డు స్థానాలకు పోటీ నెలకొంది. మండలంలోని మ్యాకవెంకయ్యపల్లిలో 8 స్థానాలకు గాను ఒక్కో నామినేషన్, ఏడుమోటలపల్లిలో 8 వార్డులకు గాను 5 వార్డులకు ఒక్కో నామినేషన్, నార్సింహునిపేటలో 6 వార్డులకు, రామబద్రునిపల్లిలో నాలుగు స్థానాలకు ఒక్కో నామినేషన్ చొప్పున మాత్రమే దాఖలు కాగా అధికారులు ఏకగ్రీవమైనట్లు ధృవీకరించాల్సి ఉంది.

మలి విడతలో తేలిన అభ్యర్థుల లెక్క

జగిత్యాల అర్బన్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల అర్బన్ మండలంలో ఐదు సర్పంచ్ స్థానాలకు గాను అంబారిపేట సర్పంచ్ పదవి ఏకగ్రీం అయింది. మిగతా నాలుగు సర్పంచ్ పదవులకు 18 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. 36 వార్డులకు 14 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. మిగతా 22 వార్డులకు గాను 85 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

సారంగాపూర్ మండలంలో ముగ్గురు సర్పంచ్‌లు ఏకగ్రీవం

సారంగాపూర్ మండలంలోని నాయికపు గూడెం, బీంరెడ్డిగూడెం, రంగపేట ఒడ్డెర కాలనీ మూడు గ్రామాల సర్పంచ్‌లు ఏకగ్రీవం అయ్యాయి. ఆ గ్రామాల పరిధిలో ఉన్న 16 వార్డులతో పాటు మండలంలో మరో 14 వార్డులు ఏకగ్రీవం అయినట్లు ఎన్నికల అధికారి తెలిపారు. మండలంలో మిగిలిన 15 సర్పంచ్ స్థానాలకు 63 మంది బరిలో ఉన్నారు. 114 వార్డులకు గాను 274 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు.

జగిత్యాల రూరల్‌లో రెండు సర్పంచ్‌లు ఏకగ్రీవం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలంలో 29 గ్రామపంచాయతీలకు గాను రెండు స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. 104 సర్పంచ్ అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ఎంపీడీఓ రమాదేవి తెలిపారు. అలాగే 268 వార్డుల్లో 86 ఏకగ్రీవం కాగా గుత్రాజ్‌పల్లిలోని ఒకటోవార్డులో ఎలాంటి నామినేషన్ దాఖలు కాలేదని ఎంపీడీవో తెలిపారు. మిగిలిన 181 స్థానాలకు 505 మంది వార్డు సభ్యులు బరిలో ఉన్నారు.

మల్యాల మండలంలో 20 వార్డు స్థానాలు ఏకగ్రీవం

●మల్యాల: మండలంలో సర్పంచ్, వార్డు స్థానాలకు 560మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. 19 గ్రామ పంచాయతీల పరిధిలో 101మంది సర్పంచ్ పదవుల కోసం నామినేషన్లు దాఖలు చేయగా 21మంది ఉపసంహరించుకున్నారు. దీంతో 80మంది సర్పంచ్ అభ్యర్థులు బరిలో ఉన్నారు. 186 వార్డు స్థానాలు ఉండగా 20 వార్డు స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 166 వార్డు స్థానాలకు 480 మంది అభ్యర్థులు పోటీలో నిలిచారు. గొర్రెగుండంలో 3, లంబాడిపల్లిలో 3, మద్దుట్లలో 1, మానాలలో 1, మ్యాడంపల్లిలో 3, రాజారంలో 2, రామన్నపేటలో 5, తక్కళ్లపల్లిలో 2



వార్డు స్థానాలు ఏకగ్రీవం అయ్యాయి. మండలంలోని మ్యాడంపెల్లిలో 9మంది, తాటిపల్లిలో 6, లంబాడిపల్లిలో 6, రాజారంలో 6, మానాలలో 5, పోతారంలో 5, సర్వాపూర్‌లో 5, బల్వంతాపూర్‌లో 4, ఓబులాపూర్‌లో 4, తక్కళ్లపల్లిలో 4, గొల్లపల్లిలో 3, గుడిపేటలో 3, మద్దుట్లలో 3, మల్యాలలో 3, ముత్యంపేటలో 3, నూకపల్లిలో 3, రామన్నపేటలో 3, రాంపూర్‌లో 3, గొర్రెగుండంలో 2 సర్పంచ్ పదవి పోటీలో ఉన్నారు.

గోండుగూడెంలో సర్పంచ్, వార్డు సభ్యుల ఏకగ్రీవం

●బీర్‌పూర్: బీర్‌పూర్ మండలం గోండుగూడెం సర్పంచ్ స్థానం, ఆరు వార్డు స్థానాలు ఏకగ్రీవం అయినట్లు అధికారులు తెలిపారు. సర్పంచ్ ఎస్టీ మహిళకు రిజర్వ్ రావడంతో పురుక దీపకల్పన సింగిల్ నామినేషన్ దాఖలు చేశారు. బీర్‌పూర్ మండలంలో 17 గ్రామాలకు 56 మంది నామినేషన్ వేశారు. శనివారం 10మంది ఉపసంహరించుకున్నారు. అందులో గోండుగూడెం ఏకగ్రీవం కావడంతో మిగిలిన 16 గ్రామాలకు 46 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నట్లు అధికారులు తెలిపారు. వార్డు సభ్యుల కోసం 275 నామినేషన్లు వచ్చాయి. అందులో 21 వార్డుల్లో సింగిల్ నామినేషన్ రావడంతో ఆ వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. ఏడుగురు అభ్యర్థులు తమ నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. మిగతా 115 వార్డులకు 247 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు ఎంపీడీవో భీమేష్ తెలిపారు.

రాయికల్ మండలంలో రెండు జీపీలు ఏకగ్రీవం

●రాయికల్: రాయికల్ మండలంలోని 32 గ్రామ పంచాయతీలకు గాను రెండు గ్రామపంచాయతీలు ఏకగ్రీవం అయ్యాయి. వీరాపూర్ గ్రామ సర్పంచ్, 8 వార్డు స్థానాలకు సింగిల్ నామినేషన్లు దాఖలు కావడంతో సర్పంచ్ దిండిగాల గంగు రామస్వామితో పాటు వార్డు సభ్యులందరూ ఏక్రగీవం అయ్యారు. వస్తాపూర్ సర్పంచ్‌గా గుగ్లావత్ తిరుపతి శనివారం ఏక్రగీవంగా ఎన్నికయ్యాడు. కాగా ఈ గ్రామంలో 8 వార్డులు ఉండగా 5 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. మిగిలిన 30 గ్రామ పంచాయతీలకు సర్పంచ్ పదవికి 112 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. వార్డు సభ్యులుగా 450 మంది అభ్యర్థులు పోటీలో ఉండగా 86మంది వార్డు సభ్యులు ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. నామినేషన్ల ఉపసంహరణ చివరి రోజున 26 మంది సర్పంచ్ అభ్య ర్థులు, 32మంది వార్డుఅభ్యర్థులు బరి నుంచి తప్పుకున్నారు.

కొడిమ్యాల మండలంలో సర్పంచ్ బరిలో 90 మంది

●కొడిమ్యాల: కొడిమ్యాల మండలంలోని 24 గ్రామ పంచాయతీలు ఉండగా చింతల్లపల్లి గ్రామ సర్పంచు పదవికి ఎల్కపెల్లి సుమలత సింగిల్ నామినేషన్ దాఖలు కాగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి డి. శ్రీనివాస్ తెలిపారు. 8వార్డులకు ఆరు వార్డులకు సింగిల్ నామినేషన్లు దాఖలు కాగా శనివారం మిగతా రెండు వార్డులకు పోటీలో ఉన్న వారు ఉపసంహరణ చేసుకోగా 8 మంది వార్డు సభ్యులు ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి తెలిపారు. మండలంలోని మిగతా 23 గ్రామ పంచాయతీలలో 165 మంది నామినేషన్ వేయగా సర్పంచ్ పదవికి 90 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్లు సహాయ జిల్లా ఎన్నికల అధికారి, ఎంపీడీవో ఇస్వరూప తెలిపారు. 19 మంది ఉపసంహరించుకున్నారు. 216 వార్డు సభ్యులకు గాను 509 నామినేషన్లు రాగా 65 ఏకగ్రీవమైనట్లు సహాయ జిల్లా ఎన్నికల అధికారి, ఎంపీడీవో తెలిపారు. 28 మంది ఉపసంహరించుకున్నట్లు తెలిపారు. 216 వార్డులకు 509 నామనేషన్ వేయగా 28 మంది ఉపసంహరించుకున్నారు. సభ్యత్వానికి 395 మంది బరిలో ఉన్నారని ఎన్నికల అధికారి తెలిపారు.

కాంగ్రెస్ శ్రేణులతో ఎమ్మెల్యే సమావేశం

మల్యాల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మల్యాలలో సమావేశం అయ్యారు. సర్పంచ్, వార్డు స్థానాల అభ్యర్థుల ఉపసంహరణలకు శనివారం చివరి రోజు కావడంతో పోటీ పడుతున్న అభ్యర్థులతో సమావేశమై పార్టీ అభ్యర్థులను అధిక సంఖ్యలో గెలిపించడానికి గాను సహకరించాలని సూచించారు. ముందు రోజుల్లో ఎంపీటీసీ, సింగిల్‌విండో ఎన్నికలు ఉండనున్న దృష్ట్యా అవకాశాలు వస్తాయని పేర్కొనడంతో చాలా గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేస్తున్న అనేక మంది సర్పంచ్, వార్డు స్థానాల అభ్యర్థులు తమ నామినేషన్లు ఉపసంహరించుకున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

కొడిమ్యాల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు ముమ్మాడి స్వామి తల్లి అనుసూర్య, కొడిమ్యాల మాజీ ఎంపీటీసీ సురుగు శ్రీనివాస్ తండ్రి సురుగు రాజయ్య, వేముల మహేష్, మదుశ్రీ ఇటీవల మృతి చెందగా మృతుల కుటుంబ సభ్యులను శనివారం చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట సింగిల్ విండో చైర్మన్ రాజనర్సింగరావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నారాయణగౌడ్, సీనియర్ నాయకులు మల్లిఖార్జున్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, మహిపాల్‌రెడ్డి, ముత్యం శంకర్‌గౌడ్, ప్రసాద్, నసీరొద్దీన్, రవి, తదితరులు ఉన్నారు.

మాజీ ఎమ్మెల్యే పరామర్శ

మండల కేంద్రానికి చెందిన మాజీ ఎంపీటీసీ సురుగు శ్రీనివాస్ తండ్రి సురుగు రాజయ్య ఇటీవల మృతి చెందగా శనివారం చొప్పదండి మాజీ ఎమ్మెల్యే రవిశంకర్ పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట పలువురు బీఆర్ఎస్ నాయకులు తిరుపతిరెడ్డి, స్వామి, ప్రభుదాస్, లక్ష్మన్ మహేష్ తదితరులు ఉన్నారు.